# మిసిమి

మాస పత్రిక

మార్చి 1993

వెల రూ. 4/-



# మానవత్వం మరణిస్తుందా ?



'సెర్బ్'చే "ఒకే రోజున 16 సార్లు రేప్ చెయ్యబడిన 18 సంవత్సరాల బొసానియన్ వనిత"
ఆధునిక ఘర్షణల్లో జరుగుచున్న అమానుష చర్యలు.

# మిసిమి

*"All that we are is the product of what we have thought,"*
*is "We are what we think."* – **Dammapada.**

సంపుటి 4 మార్చి 1993 సంచిక 8

సంపాదకుడు: రవీంద్రనాథ్ ఆలపాటి

## విషయసూచిక

ప్రేమించడం ఒక కళ – అన్నపరెడ్డి వెంకటేశ్వర రెడ్డి

మానవత్వం మరణిస్తుందా? – డా॥ మాళవిక

కన్యాశుల్కం – పాత్ర పరిశీలన – శ్రీపాద కామేశ్వరరావు

సాహిత్యము: వ్యక్తి వికాసము – ఆర్.ఎస్. సుదర్శనం

శాస్త్ర–కళా దర్శనం – ఎన్.వి. బ్రహ్మం

తెలుగు సాహిత్యం – కొన్ని నిజాలు? – డా॥ ముకురాల రామారెడ్డి

బహుముఖ రామాయణం – రవీంద్రనాథ్

సంగీతంలో సాంకేతిక పదాలు – కొండిపర్తి శేషగిరిరావు

విడిప్రతి రూ. 4/- వార్షిక చందా రూ.50/-

ముఖచిత్రం

SRI KRISHNA AS AN ENVOY –
oil on canvas by
Raja Ravi Varma, 1906.

'మిసిమి'లో ప్రచురించే వ్యాసాలతో సంపాదకులు ఏకీభవించారనుకో నవసరంలేదు.

# LIVING DICTIONARY
## (DEVIL'S DICTIONARY)

*Compiled by*
AMBROSE BIERCE (1911)

**Evangelist,** *n.* A bearer of good tidings, particularly (in a religious sense) such as assure us of our own salvation and the damnation of our neighbors.

**Executive,** *n.* An officer of the Government, whose duty it is to enforce the wishes of the legislative power until such time as the judicial department shall be pleased to pronounce them invalid and of no effect. Following is an extract from an old book entitled, The *Lunarian Astonished*-Pfeiffer & Co., Boston, 1803:

**Exhort,** *v.t.* In religious affairs, to put the conscience of another upon the spit and roast it to a nut-brown discomfort.

**Existence,** *n.*

> A transient, horrible fantastic dream,
> Wherein is nothing yet all do seem:
> From which we're wakened by a friendly nudge
> Of our bedfellow Death, and cry: "O fudge!"

**Experience,** *n.* The wisdom that enables us to recognize as an undersirable old acquaintance the folly that we have already embraced.

> To one who, journeying throught night and fog,
> Is mired neck-deep in an unwholesome bog,
> Experience, like the rising of the dawn,
> Reveals the path that he should not have gone.
>
> *Joel Frad Bink.*

**Expostulation,** *n.* One of the many methods by which fools prefer to lose their friends.

**Extinction,** *n.* The raw material out of which theology created the future state.

**Faith,** *n.* Belief without evidence in what is told by one who speaks without knowledge, of things without parallel.

**Famous,** *adj.* Conspicuously miserable.

> Done to a turn on the iron, behold
> Him who to be famous aspired.
> Content? Well, his grill has a plating of gold,
> And his twistings are greatly admired.
>
> *Hassan Brududdy.*

**Felon, n.** *A person of greater enterprise than discretion, who in embracing an opportunity has formed an unfortunate attachment.*

**Fib,** *n.* A lie that has not cut its teeth. An habitual liar's nearest approach to truth: the perigee of his eccentric orbit.

**Fickleness,** *n.* The iterated satiety of an enterprising affection.

**Fiddle,** *n.* An instrument to tickle human ears by friction of a horse's tail on the entrails of a cat.

**Fidelity,** *n.* A virtue peculiar to those who are about to be betrayed.

**Finance,** *n.* The art or science of managing revenues and resources for the best advantage of the manager. The pronunciation of this word with the i long and the accent on the first syllable is one of America's most precious discoveries and possessions.

**Flag,** *n.* A colored rag borne above troops andhoisted on forts and ships. It appears to serve the same purpose as certain signs that one sees on vacant lots in London–"Rubbish may be shot here.'

సమీక్ష:

# ప్రేమించడం ఒక కళ

**Art of Loving**
**By ERICH FROMM**

– అన్నపరెడ్డి వెంకటేశ్వర రెడ్డి

బాగా అభివృద్ధి చెందిన పారిశ్రామిక దేశాలలో, సమతాభావం వ్యాపిస్తున్న కారణంగా, భిన్నత్వాన్ని తొలగించాలనే ప్రవృత్తి సమతాభావనతోను, దాని అనుభవం తోను అత్యంతంగా ముడిపడి ఉంది. సమతకు మతపరంగా అర్థం చెప్పాలంటే: మనమందరం దేవుని బిడ్డలము; మనమంతా మానుష-దైవ పదార్థాన్ని పంచుకొంటాము. మనమంతా ఒకటే. దీనికి మరొక అర్థం గూడ ఉంది; మనమందరం ఒకటే అన్నమాట నిజమే అయినా మన మధ్య తేడాలను గూడ గుర్తించాలి. మనలోని ప్రతి ఒక్కరు ఒక ప్రత్యేక వ్యక్తి ; ఒక ప్రత్యేక విశ్వము. ఉదాహరణకు వ్యక్తి అనన్యత మీద ఉన్న అటువంటి నమ్మకాన్ని యూదుధర్మ సంకేతం (Talmudic) చాటి చెబుతుంది. ''ఎవరైన ఒక జీవిని రక్షిస్తే మొత్తం విశ్వాన్ని రక్షించినట్టు, ఒక జీవిని నాశనంచేస్తే మొత్తం విశ్వాన్ని నాశనం చేసినట్లు'', ''వ్యక్తిత్వం వికసించాలంటే సమానత్వం అవసరం'', అని పాశ్చాత్య వికాసయుగం భావించింది. దీనికి అర్థం (కాంట్ దీనికి స్పష్టమైన రూపాన్ని ఇచ్చాడు) ఒక మనిషి మరొక మనిషి చేతిలో పనిముట్టు కారాదు. మానవునికి మానవుడే లక్ష్యమై, ఒకడు మరొకడి చేతిలో పరికరం కానంతవరకు, మానవులంతా సమానులే. వికాస యుగంలో, నాటి తత్వాన్ననుసరించి, వివిధ సంప్రదాయాలకు చెందిన మేధావులు, సమతను దోపిడినిర్మూలనంగా నిర్వచించారు. మానవుని మానవుడు ఉపయోగించుకోవడాన్ని, అది మంచికైన చెడుకైన, ఖండించడమే సమత అన్నారు.

నేటి పెట్టుబడిదారీ వ్యవస్థలో సమతకు అర్థం వేరు. సమానత్వం అంటే స్వయంచలన యంత్రాలను చూపిస్తున్నారు. మనుష్యుల విషయానికి వస్తే అది వ్యక్తిత్వం లేకపోవడం అంటున్నారు. ఈనాడు సమానత్వం అంటే ''ఏకత్వం'' (oneness) కాదు. ''సాదృశ్యత'' (sameness) అంటున్నారు. ఇక్కడ సాదృశ్యత అంటే ఒకే వృత్తి చేసుకొంటూ, ఒకేరకం వార్తా పత్రికలు చదువుతూ, ఒకే వినోదాన్ని చవిచూస్తూ, ఒకే అనుభూతులను, భావాలను కలిగిఉండే మనషుల ఆలోచనా సరళిలోని సాదృశ్యత. దీనిని బట్టి మామూలుగా మనం ప్రగతికి నిదర్శనాలని భావించే సమతలాంటి కొన్నింటిని కొంతవరకు శంకించవలసి ఉంటుంది. స్త్రీ సమానత్వానికి నేను వ్యతిరేకంగా మాట్లాడడం లేదని వేరే చెప్పవలసిన పనిలేదు; కాని సమతా ప్రవృత్తిలోని ప్రయోజనాలతో మనిషి మోసపోరాదు; భిన్నత్వాన్ని తొలగించే ప్రయత్నంలో అది ఒక భాగము. మనం సమతకు చెల్లించిన మూల్యం ఇది: స్త్రీలు పురుషులతో సమానం, ఎందుకంటె వారు పురుషులకంటె భిన్నంగా లేరు. 'ఆత్మకు లింగం లేదు' (l'ame n'a pas de sexe) అనే వికాసయుగ నినాదాన్ని అందరు ఆమోదించారు. లైంగిక ధృవాభిసరణం (polarity of sexes) మటుమాయమైంది. దానితోపాటు, ఈ ధృవాభిసరణం మీద ఆధారపడిన కాముక ప్రేమ (Exotic love) అదృశ్యమైంది. అభిముఖ సమాజం వ్యక్తిత్వ రహితమైన సమతాధర్మాన్ని ప్రబోధిస్తోంది. దీనికికారణం మానవరాశిగా (Mass aggregation) మారిన సమాజంలో ఒరిపిడి లేకుండ మృదువుగ పని చేయాలంటే అన్నీ ఒకేలాగుండే మానవాణువులు కావాలి. ఒకేరకమైన ఆదేశాలను నిర్దేశాలను పాటిస్తున్నప్పటికీ, ప్రతి ఒక్కరు తమ ఇష్టానుసారమే ప్రవర్తిస్తున్నామనే భ్రాంతిలో ఉండే మానవాణువులు కావాలి. విపరీతంగా ఉత్పత్తి అవుతున్న నేటి వినిమయ వస్తువులకు ప్రామాణికత అవసరమైనట్లే, సాంఘిక ప్రక్రియకు గూడ ''మనిషి ప్రామాణికత'' కావలసి వచ్చింది. ఈ ప్రామణికతనే ''సమానత్వం'' అంటారు.

# మానవత్వం మరణిస్తుందా?

డా॥ మాళవిక Ph.D.

నీ ప్రమేయం లేకనే నీవు పుడుతున్నావు; ఇంతకంటె నీ ప్రమేయం లేకనే నీవు గిడుతున్నావు. ఎప్పుడు ఎవరికి ఎక్కడ పుడుతున్నావో నీకు ఎరుక లేదు. నిన్ను ప్రేమించే వాళ్ళకంటె ముందే నీవు గతిస్తున్నావు. నీకు తెలివితేటలున్నాయి. తెలివి తేటలున్నాయన్న సంగతి గూడ నీకు తెలుసు. ప్రకృతి శక్తుల ముందు నీవు అల్పుడవని నీ వెరుగుదువు. అయినా వాటిని జయించాలని నీవు వాటితో తలపడ్డావు. ఫలితంగా నాగరకత ఆవిర్భవించింది. అది నీకు ప్రకృతికి మధ్య అడ్డుగోడై నిలిచింది. దానితో నీవు ప్రకృతికి దూరమయ్యావు. సిమెంటు ఉక్కు కట్టడాలలో ఏ.సి. గదులలో, సింథెటిక్ దుస్తులలో, నేమ్ ప్లేట్లు, డోర్ నంబర్ల ప్రపంచంలో. (నేమ్ ప్లేట్ పై ఉన్న పేరు, డిగ్రీ, హోదాలకు ఉన్న గౌరవం అసలు వ్యక్తికి లేదు. అతని హోదాను డిగ్రీని గౌరవిస్తాముగాని, అతనిని గౌరవించము, గుర్తించము) ఏణ్యక కుటుంబాలలో (ఉమ్మడి కుటుంబాలు పోయి, భార్యభర్త పిల్లల వరకే పరిమితమైన కుటుంబాలు వచ్చాయి), కృత్రిమ వాతావరణంలో నీవు నివసిస్తూ సహజత్వాన్ని కోల్పోయావు. మనసొకటి చెబితే మరొకటి చేస్తున్నావు. నీ ప్రవృత్తికి నీవే దూరమయ్యావు. ఫలితంగా ఒంటరివాడవైనావు; ఏకాకివైనావు. నీకు ఇప్పుడు 'నా' అనే వాళ్ళు లేరు. ఈ ఒంటరితనం దుర్భరం; ఎలాగో దీనినుంచి బయటపడాలి. బాహ్య ప్రపంచంతో, ఇతరులతో సంలీనం చెందాలి. లేకపోతే పిచ్చివాడివై పోతావు. మరి ఇతరులతో సంలీనం చెందడం ఎలా?

అనువృత్తి ద్వారా సాధించే సంలీనం (union by conformity) తీవ్రంగాను దౌర్జన్య పూరితంగాను ఉండదు. అది దైనందిన జీవితంలో నెమ్మదిగ, మెత్తగ, తెలియకుండానే ఆర్జితమవుతుంది. ఈ కారణంచేత అది ఒంటరితనం వలని బాధను తగ్గించలేదు. సమకాలీన పాశ్చాత్య సమాజంలో ఒకడు సమాజానుగుణంగా మారలేదనడానికి (సమాజంలో ఇమడలేదనడానికి) గుర్తులు (తాగుడు, మత్తుమందుల వాడకం, బలాత్కారలైంగికత, ఆత్మహత్యలు. అంతేకాదు, ఈ పరిష్కారం శరీరానికి సంబంధించి కాక మనస్సుకు సంబంధించింది. ఈ కారణంవల్ల గూడ, జాతర్ల తన్మయతా పరిష్కారంతో పోలిస్తే, ఇది లోపభూయిష్టమైనదే. సమూహానువృత్తి (Herd community) వల్ల ఒకే ఒక ప్రయోజనం ఉంది: అది శాశ్వతమైంది. తెరలు తెరలుగ వస్తూ పోతూ ఉండేది కాదు. బాలునికి మూడు నాలుగు సంవత్సరాల వయస్సులో అనువృత్తి మొదలవుతుంది. (అంటే సమాజానుగుణంగా మారనారంభిస్తాడు). ఇక ఆ తరువాత సమాజంతో అతనికి సంబంధం ఎప్పుడూ తెగిపోదు. అంత్యక్రియలు, అతని అంతిమ సామాజిక కర్మ అని ముందుగా తెలిసినప్పటికి, అవి పొల్లుపోకుండ ఆచారాన్ని అనుసరించే జరుగుతాయి.

ఒంటరితనం నుంచి వ్యాకులతను తొలగించే ఒక మార్గం అనువృత్తి (Conformity). సమకాలీన జీవితంలో దీనికంటె వేరైన మరొక కారణాన్ని గమనించాలి: గానుగెద్దుజీవితం, ఒకే రకమైన విషయ సుఖం—ఈ రెండింటి పాత్ర ఎంతో ఉంది. మనిషి ''తొమ్మిదినుంచి ఐదు గంటల మనిషి'' అయిపోతున్నాడు. శ్రామిక సేనలో అతడు ఒక బంటు, లేదా మేనేజర్లు, గుమాస్తాల సేనలో ఒక సైనికుడు అవుతున్నాడు. తనంత తాను ఏ పనికి ఉపక్రమించడు. అతని వృత్తి వ్యవస్థ అతడు చేయవలసిన పనులన్నింటిని నిర్దేశిస్తుంది. శ్రేణిలో పైన ఉన్నవారికి క్రింద ఉన్నవారికి తేడా ఏమీలేదు. వ్యవస్థ నిర్దేశించిన తీరులో, వేగంతో తమకు అప్పగించిన పనిని పూర్తిచేస్తారు. సంతోషం, సహనం,

అందుకే ఈ రోజు మత్తుద్రవ్యాల సేవనం ఎక్కువైంది. L.S.D, మాదకద్రవ్యాల సేవనం మితిమీరింది. జాతర్లలో లాగ తాండవం చేసి పూనకం తెచ్చుకొనే మార్గాలు ఈనాడు కాబెరా నృత్యాలలో లభిస్తున్నాయి. వీటి ద్వారా కొంచెం సేపైన నిన్ను నీవు మరిచి అనంతవిశ్వంతో సంలీనం చెందవచ్చు. మత్తుదిగిన తరవాత కథ మామూలే. పరిష్కారం ఇది కాదు, ప్రేమ. అసలు ఈ ఒంటరితనం, ఏకాకితనం నీకు ఎలా వచ్చాయి?

ఒకప్పుడు నీవు ఆటవికుడవు. అప్పుడు ప్రకృతి ఒడిలో పరవశించావు. స్వర్గాన్ని చూచావు. ప్రకృతీ నీవూ వేరుకారు. అక్కడ అనిశ్చితతకు (uncertainity) చోటులేదు. ప్రకృతిలో ఉంటూనే దానిని అధిగమించ నారంభించావు. నాగరకత పెరిగింది. దానితో నిశ్చితతలోనుంచి అనిశ్చితతలోకి విసరబడ్డావు. నీవు నిర్మించుకొన్న నాగరక ప్రపంచంలో ప్రతిదీ అనిశ్చితమే. అనిశ్చితత భయానికి దారితీస్తుంది; వ్యాకులతకు దారితీస్తుంది. నీవు కొంత దూరం ఈ దిశలో పయనించావు; అంటే ప్రకృతికి దూరంగా నడిచావు. ఒకసారి పుట్టిన తరవాత నీవు మాతృగర్భాన్ని తిరిగి ప్రవేశించలేవు. మళ్ళీ ప్రకృతి ఒడిని తిరిగి పొందలేవు. నిన్ను వెనుదిరిగి రానీయకుండ దేవతలు జ్వలిస్తున్న కృపాణాలతో కాపలాకాస్తుంటారు. నీదారి ముందుకే, వెనుదిరిగే ప్రసక్తే లేదు. నీవు మరొక క్రొత్త స్వర్గాన్ని వెదుక్కోవాలి. ప్రకృతితో నీవు పోగొట్టుకొన్న ఐక్యతను, నిశ్చితత్వాన్ని, నీ స్వర్గధామాన్ని పునః సృష్టి చేయాలి. ఈ ప్రయత్నంలో నీ మేధా సంపత్తిని పెంపొందించుకోవాలి. ఈ పునస్సృష్టి మానవతా ప్రాతిపదికపైన జరగాలి. అత్యంత నిశ్చిత స్థితిలో నుంచి అనిశ్చిత స్థితిలోకి విసరబడ్డ నీకు రెండే రెండు విషయాలు స్పష్టంగా తెలుసు. ఒకటి గతం గురించి. రెండవది అనాగతంలో మరణం ధృవమని. ప్రకృతిలోనే ఉంటూ, దానినే అధిగమిస్తూ, ఒంటరితనంతో, అనిశ్చితతో, వ్యాకులతతో వేగిపోతున్న ఈ మానవుని 'అస్తిత్వ' సమస్యకు పరిష్కారమేమిటి? ఈ మానవ

విశ్వాసం పైకిపోవాలనే ఆకాంక్ష, మెరమెరలు లేకుండ ప్రతి ఒక్కరితో కలిపి పోగల సామర్థ్యం – ఈ అనుభూతులన్నీ గూడ నిర్దేశితాలే. అంతకాక పోయినా కొంత మేరకైన వినోదం గూడ అంతే. బుక్ క్లబ్‌లు పుస్తకాలు ఎంపిక చేస్తుంటే, సినిమాలను నిర్ణయించేది హాలు యజమానులు, వాటిని తీసేవారు, వాటిని గురించి చేసే ప్రకటనలు. మిగతాది అంతా గూడ ఒకే బాణీ: ఆదివారం కారుషికారీ, దూరదర్శన్‌ను చూడడం, పేకాట, పార్టీలు, పుట్టిన దగ్గరనుంచి గిట్టేవరకు, సోమవారం నుంచి సోమవారానికి, పొద్దు పొడిచిన దగ్గరనుంచి పొద్దుకుంకేవరకు చేసే పనులన్నీ ఒకే రకం, అన్నీ ముందుగా ఏర్పాటు చేయబడినవే. ఈ మార్పులేని దినచర్య (గానుగెద్దు జీవితం) అనే వలలో చిక్కుకొన్న మానవుడు తనొక మనిషినని, తనొక అనన్య వ్యక్తినని, ఆశా నిరాశలతో, సుఖ దుఃఖాలతో, భయంతో, ప్రేమపిపాసతో, ఒంటరితనం శూన్యాల వలని భీతితో, జీవించడానికి లభించిన ఒకే ఒక అవకాశం ఈ జన్మ అని మరచిపోకుండ ఎలా ఉండగలడు?

సంలీనాన్ని సాధించే మూడవ విధం సృజనాత్మక క్రియ. అతడు లలిత కళాకారుడు కావచ్చు లేదా వృత్తికళాకారుడు కావచ్చు. ఎవరైన సృజనాత్మక క్రియలో తనకంటె భిన్నమైన బాహ్య ప్రపంచాన్ని ప్రతిబింబించే పదార్థంలో సంలీనమవుతాడు. వడ్రంగి బల్ల చేయడంలో కానివ్వండి, కంసాలి నగ చేయడంలో కానివ్వండి, రైతు ధాన్యం పండించడంలో కానివ్వండి, చిత్రకారుడు చిత్రాన్ని గీయడంలో కానివ్వండి. - ఏ సృజనాత్మక క్రియలోనైన పనివాడు తను సృజించే వస్తువుతో ఐక్యమవుతాడు; మనిషి సృజనాత్మక ప్రక్రియద్వారా ప్రపంచంతో ఏకమవుతాడు. ప్రణాళికను వేసుకొంది నేను, ఉత్పత్తి చేసింది నేను, నా కృషి ఫలితాన్ని చూచి ఆనందింపగలిగింది నేనే-ఇది ఒక్క ఉత్పాదక క్రియకు మాత్రమే వర్తిస్తుంది. కాని నేటి పనివిధానంలో గుమాస్తా, అనంతంగా తిరిగే బెల్టువద్ద నిలబడే కార్మికుడు,– వీరు చేసే పనులలో సంలీనగుణం లేదు. పనివాడు

సంసారానికి పరమార్థం ఏమిటి? అసలు విషయం ఏమిటంటే, తన అస్తిత్వమే తనకు సమస్య అయినది మానవుని కొక్కడికే. ఇది గుర్తించినదీ మానవుడొక్కడే; మనిషి ఎప్పుడు పుట్టినట్లు? తల్లి గర్భంలో నుంచి బొడ్డు కోసుకొని భూమి మీద పడినప్పుడా? కాదు. మానవజాతి సమస్య జనన రహస్యాన్ని ఛేదించడం. తల్లి గర్భంలోనుంచి బయట పడగానే జననం పూర్తికాలేదు. జనన ప్రక్రియ సాహిత్య ప్రక్రియ, ఎడతెగనిది. మనిషి జ్ఞానాన్ని సంపాదించుకొంటూ ముందుకు పోతున్నంత కాలం, తనలోని "తన"ను ఎరగడానికి ప్రయత్నించినంత కాలం, అతడు పుడుతూనే ఉంటాడు. "ఆత్మానం విద్ధి"; తనను గురించి ఏ కొంత తనకు తెలిసినా అది జనన ప్రక్రియలో ఒక అడుగు ముందుకే. జ్ఞానం సంపాదించడమంటే తనను తాను ఎరగడమే. తనను తాను ఎరగడమంటే అంతకు ముందర తెలియని "నిన్ను" నీవు తెలుసుకొనడమే. అంతకు ముందర తెలియని 'నిన్ను"ను నీవు పుట్టించడమే. ఈ విధంగా జనన ప్రక్రియ అలా సాగిపోతూ ఉండవలసిందే. మనిషి చనిపోయే లోపల పుట్టాలి. పుట్టడమంటే నిన్ను నీవు తెలుసుకోవడమే. కాని మనలో చాలమందిమి పుట్టకముందే గిడుతున్నాము.

ఈ ప్రశ్నలు మానవ సంసారాని (Human existence) కి సంబంధించిన సమస్యలు. వీటికి పరిష్కారం ఏమిటి? ఈ సమస్యలను ఈ నూతనార్థంలో లేవనెత్తి పరిష్కరింప ప్రయత్నించినవాడు ఎరిక్ ఫ్రామ్.

మనోవిశ్లేషణ ప్రక్రియలో విశేషజ్ఞానాన్ని అర్జించిన ఫ్రామ్, 1980, మార్చి 18వ తేదీన స్విట్జర్లాండ్ లో గుండెపోటుతో మరణించాడు. 23 మార్చి 1900 లలో ఫ్రాంక్‌ఫర్ట్–యామ్–మేన్ (Frankfurt–am–Main)- అంటే జర్మనీ మధ్యంలోని ముఖ్యనదిపై ఉన్న నగరంలో జన్మించాడు. హైడిల్ బర్గ్, ఫ్రాంక్‌ఫర్ట్, మ్యూనిక్ విశ్వవిద్యాలయాలలో సామాజిక శాస్త్రం, మనోవిజ్ఞానశాస్త్రాలను అభ్యసించాడు. మనోవిశ్లేషణంలో బెర్లిన్ లో

యంత్రానికో, లేదా బ్యూరాక్రటిక్ వ్యవస్థకో వేళ్ళాడుతుంటాడే తప్ప, సంలీనం కాదు. అతడు అతడు కాకుండపోయాడు–అందువలన అనువృత్తికంటె వేరైన సంలీనానికి స్థానం లేదు.

ఉత్పాదక క్రియలో సాధించిన సంలీనత వ్యక్తులమధ్య సంలీనత కాదు. జాతర్ల తన్మయత్వంలో సాధించిన సంలీనత క్షణభంగురము; అనువృత్తి (Conformity) వల్ల సాధించిన సంలీనం మిథ్యాసాయుజ్యం మాత్రమే. అందుకని ఇవన్నీ మానవ సంసారానికి పాక్షిక సమాధానాలు మాత్రమే, పూర్తి సమాధానం వ్యక్తికి వ్యక్తికీ మధ్య సాధించే సాయుజ్యంలో, మరొక వ్యక్తితో సంలీనం చెందడంలో, –అంటే ప్రేమలో ఉంది.

ఇతరులతో ఐక్యం కావాలి, కలవాలనే వాంఛ మనకున్న వాంఛలలోకెల్ల అతి బలవత్తరమైంది. అది ప్రాథమిక మానసిక ఉత్కంఠ. మానవ జాతిని, తండాను, కుటుంబాన్ని, సమాజాన్ని కలిపి ఉంచే శక్తి అది. దీనిని సాధించలేక పోవడం అంటే అర్థం ఉన్మత్తత లేదా వినాశం– స్వనాశం, పరనాశము. ప్రేమ లేకుండ మానవాళి ఒక్కనాటికి మనలేదు. అయినా వ్యక్తికి వ్యక్తికీ మధ్య ఉన్న సంలీనాన్ని 'ప్రేమ' అంటే మనం చాల చిక్కులో పడతాము. సంలీనాన్ని అనేక విధాలుగ సాధించవచ్చు. వివిధాలైన ప్రేమ రూపాలలో ఉన్న సామాన్య లక్షణంకంటే విభేదాలు ఏమీ తక్కువైనవి కావు. వాటి అన్నింటిని ప్రేమ అనవలసిందేనా? లేక గత నాలుగువేల సంవత్సరాలుగ ప్రాక్పశ్చిమ దేశాలలో వెలసిన మానవీయమైన దర్శనాలకు, మతాలకు ఆదర్శమైన ఒక ప్రత్యేక రకం సాయుజ్యాన్ని మాత్రమే ప్రేమ అనే పదంతో పిలుద్దామా? పదాల అర్థాలకు సంబంధించిన అన్ని తగవులలోలాగే ఇక్కడగూడ ఏదో ఒక సమాధానం చెప్పవచ్చు. కావలసింది ఏమంటే, మనం ప్రేమను గురించి మాట్లాడుతున్నప్పుడు ఎటువంటి సాయుజ్యాన్ని మనసులో ఉంచుకొని మాట్లాడుతున్నామో తెలియాలి. మనం ప్రేమనుగురించి మాట్లాడేటప్పుడు దానిని మానవ సంసారానికి పరిణత

తరిఫీదు పొందాడు. హిట్లర్ యూదుద్వేషం అతనిని 1932లో అమెరికాకు ప్రవాసం పంపింది. అక్కడ అనేక విశ్వవిద్యాలయాల్లో అతడు ఉపన్యసించాడు. కొలంబియా, యేల్, బెనింగ్‌టన్, మిచిగాన్ విశ్వవిద్యాలయాల్లో పాఠాలు చెప్పాడు. నేషనల్ ఎడ్యుకేషనల్ మెడికల్ స్కూలులో ఆచార్యపదవి నలంకరించాడు. విలియమ్ అలాన్‌సన్ ఇన్‌స్టిట్యూట్‌లో ఉపన్యాసకుడుగ పనిచేశాడు. 1960 దశాబ్ది చివరనుంచి, స్విట్జర్లాండ్ లోని మురాట్టోలో శేషజీవితాన్ని గడిపాడు.

ఇతడు ఇరవై పై చిలుకు గ్రంథాలను రచించాడు: "Escape from Freedom", "The Art of Loving", "Sane Society", "Man for Himself". "The Forgotten Language", "Psychoanalysis and Religion" అతని ప్రసిద్ధ గ్రంథాలలో కొన్ని. అతడు ఎన్ని గ్రంథాలు వ్రాసినా, ఎన్ని ఉపన్యాసాలు చేసినా అతనిలో అంతర్వాహినిగ ప్రవహిస్తున్న లక్ష్యం ఒకటే: ''మనిషిని మానవునిగ, మానవుని మానవీయునిగ పరివర్తించడమెలా? మనిషిలోని మానవతను వికసింపజేయడానికి అనుగుణ పరిస్థితులను కల్పించడమెలా?''

ఈ లక్ష్యానికి అనుగుణంగానే అతడు, ఇంతకుముందు పేర్కొన్న మానవ అస్తిత్వ సమస్యకు సమాధానం ''ప్రేమ'' అని చెప్తాడు. మానవ సంసారానికి ప్రేమ ఒక్కటే పరమార్థం అంటాడు. "Love", says Dr.Fromm, "is the only satisfactory answer to the Problem of Human existence.." ప్రేమ ద్వారా మనిషి ప్రకృతిలో పోగొట్టుకొన్న ఐక్యాన్ని, స్వర్గాన్ని మానవాళిలో దర్శిస్తాడు. ఒంటరితనం, ఏ కాకితనాలతో నిష్పన్నమైన వ్యాకులత అదృశ్యమవుతుంది.

అయితే అతడు మాట్లాడేది గర్భస్థ శిశువుకు తల్లికి మధ్య ప్రేమ గురించి కాదు. కాముక ప్రేమ వ్యక్తిక

సమాధానంగా పరిగణిస్తున్నామా లేక 'సహజీవన సంయోగం' (symbiotic union) అని పిలవబడే అపరిణత ప్రేమ రూపాలను గురించి మాట్లాడుతున్నామా?

హిట్లర్ ప్రజలను పీడించినా, దేశాలను కొల్లగొట్టినా, ఆధిపత్యం చెలాయించినా, పరపీడనకాముకుడుగా చరించినా, అతడుగూడ విధికి, చరిత్రగతికి, ప్రకృతిలో ఏదో అజ్ఞాత శక్తికి లొంగిపోయి వినీతుడు కాక తప్పలేదు; స్వపీడనకాముకుడయ్యాడు. ప్రపంచాధిపత్యాన్ని చేపట్టాలనే స్వప్నం అతని విశిష్ట లక్షణము. అలాగే అతని అంతమూ (ప్రళయాగ్ని కీలల మధ్య ఆత్మహత్య) - అతనికి స్వాభావికమే.

పరిణత ప్రేమ అంటే వ్యక్తిసమగ్రత, వ్యక్తిత్వాలు దెబ్బతినకుండ జరిగే సంలీనము. ఇది సహజీవన సంయోగానికి భిన్నమైంది. 'ప్రేమ' అనేది మనిషిలోని క్రియాత్మక శక్తి; మనిషి నుంచి మనిషిని వేరుచేసే అడ్డుగోడలను ఛేదించే శక్తి; అతనిని ఇతరులతో కలిపే శక్తి, అది అతనిని ఒంటరితనం నుంచి బయటపడేట్టు చేస్తుంది. అయినా అతడు అతడుగానే ఉంటాడు; అతని సమగ్రత చెక్కుచెదరదు. ప్రేమలో అలౌకిక విషయం ఒకటి ఉంది: ఇద్దరు ఒకటైగూడ రెండుగ ఉంటారు. మనం ప్రేమను 'క్రియాశీలత' అని పిలిస్తే, ఆ పదంలో ఉన్న అస్పష్టత అనేక చిక్కులకు దారితీస్తుంది. ఆధునికుల మతంలో క్రియాశీలత అంటే శక్తిని వెచ్చించి ఉన్న స్థితిలో మార్పును తీసుకురావడము. అలాంటప్పుడు ఒకడు వాణిజ్యం నెరపినా, వైద్యం నేర్చుకొన్నా, ఫ్యాక్టరీలో అనంతంగా తిరిగే బెల్టువద్ద నిలబడి పనిచేసినా, బల్లను తయారు చేసినా, లేదా ఆటలలో పాల్గొన్నా అతనిని క్రియాశీలుడే అంటాము. వీటిలో ప్రతి పనికి లక్ష్యం బయటనే ఉన్నది. వీటి మధ్య ఉన్న సామాన్య లక్షణం గూడ ఇదే. ఇక్కడ మనం ఒక విషయాన్ని మరిచి పోతున్నాము; అది క్రియాశీలత వెనక ఉన్న ''ప్రేరణ''; అభద్రత, ఒంటరితనంతో బాధపడేవాడు తెంపులేని పనిలో మునిగిపోతాడు. ఉదాహర

ప్రేమ కాదు. అబ్బాయి అమ్మాయి ప్రేమకాదు. మానవ అస్తిత్వ సమస్యకు పరిష్కారం కాదగిన పరిణత ప్రేమ, బుద్ధప్రేమ, సార్వజనీనక ప్రేమ, ఆత్మావగాహనం మీద ఆధారపడిన ప్రేమ; ధైర్య సాహసాలతో గూడిన ప్రేమ; పరిణత ప్రేమ అంటే వ్యక్తి సమగ్రతను, వ్యక్తిత్వాన్ని పరిరక్షిస్తూనే సంలీనం చేసే ప్రేమ; మనిషిలో క్రియాశీలక శక్తిగా మారిన ప్రేమ; తోటి మానవులకు తనకు మధ్య ఉన్న అడ్డుగోడలను కూల్చివేయగలిగిన ప్రేమ. ఈ ప్రేమ మానవునికి స్వర్గాన్ని తిరిగి ఇస్తుంది. 'God is love' అన్నప్పుడు దైవభావనలో ప్రేమ ఇదే.

మనలో అధికజనానికి ఇటువంటి ప్రేమను పెంపొందించుకొనే శక్తి లేదు. ఈ శక్తిని పెంపొందించుకోవడానికి, ఇతర కళలలోవలె ఏకాగ్రత, అభ్యాసాలు కావాలంటాడు ఫ్రామ్. అంతేగాక, ఇతర కళలకంటె గూడ దీనిలో అవగాహన, అంతర్దృష్టి కావాలన్నాడు.

దేవుడు చనిపోయాడా? ఈ ప్రశ్నకు అతడు రచించిన "you shall be as gods"లో సమాధానం లభిస్తుంది. ముందు కొంచెంగా దైవభావను గురించి వివరించాలి. అసలు దేవుడు అనేక మార్పులకు గురయ్యాడు. మానవ పరిణామంతో పాటే దైవభావనలోను మార్పులు వచ్చాయి. ప్రకృతితో పెనవేసుకొని ఉన్నప్పుడు మనిషి చెట్లను, పుట్టలను పూజించాడు; తరవాత జంతుపూజ, బహుదేవతారాధన వచ్చింది. దేవుడు మానవాకృతిలో మలచబడ్డాడు. తరవాత ఏకదేవతారాధన వచ్చింది. ఈ దేవునికి మనిషి భయపడతాడు. ఈ దేవుడిని వరాలిమ్మంటాడు, పూజిస్తాడు. అయితే పరిణామం ఇక్కడితో ఆగిపోలేదు. నిజమైన మతావలంబి, బుద్ధునివలె దేవుని ఏమీ అడగడు. దేవుని గురించి తనకేమీ తెలియదంటాడు. దేవుడు ఏ భావనకు ప్రతీకో, ఆ భావన వెనుక ఏఏ అనుభవాలున్నవో వాటియందే తనకు విశ్వాసమంటాడు.

ణకు ఇటువంటివానిని, అలాగే ధనాశ, కాంక్షలతో ప్రేరితుడైన వానిని చూడండి. వీరందరూ కోర్కెకు బానిసలే. వీరు తమకై తాము పనిచేయరు. కోర్కె (లక్ష్యం) వీరిని పనిలోకి ఈడుస్తుంది. అందు వల్ల ఈడ్వబడిన వీరి క్రియాశీలత వాస్తవానికి నిష్క్రియాత్మక (Passive) మైంది. అతడు 'కర్మ'యే గాని 'కర్త' కాదు. మరోవైపు ఒకడు, ఏ ఉద్దేశం లేకుండా, విశ్వంతో ఐక్యం కావాలని, తనను తాను తెలుసు కోవాలని నిర్ణయించుకొని ప్రశాంతంగా కూర్చుని ధ్యానం చేస్తుంటే అతనిని ''నిష్క్రియుని'' (Passive)గా లెక్కవేస్తాము. కారణం అతడు ఏమీ ''చేయడం'' లేదనుకొంటాము. నిజానికి ఈ కేంద్రీకృత ధ్యానం అన్నిటికంటె క్రియాత్మకమైనది. ఇది ఆత్మక్రియాశీలత. ఇది అంతర్గత స్వేచ్ఛా స్వాతంత్ర్యాలున్నప్పుడు మాత్రమే సాధ్యమవుతుంది. క్రియాశీలతకు, ఆధునికులు చెప్పే అర్థాలలో ఒకటి బాహ్య లక్ష్యాలను సాధించడానికి వినియోగించే శక్తిని సూచిస్తుంది. ఈ శక్తులు బాహ్య ప్రపంచంలో ఏవైన మార్పులు తీసుకురావచ్చు, తీసుకు రాకపోవచ్చు.

ప్రేమ క్రియాశీలం, నిష్క్రియాత్మక ప్రభావం కాదు. ప్రేమ అంటే (అందు)''లో నిలబడడమే'' (Standing in) కాని (దాని) ''కోసం పడిపోవటం'' (falling for) కాదు. మామూలుగా చెప్పాలంటే, ప్రేమ ముఖ్య లక్షణం ఇవ్వడమే కాని పుచ్చుకోవడం కాదు.

ఇవ్వడం (దానం) అంటే ఏమిటి? దీనికి సమాధానం వినటానికి తేలికగానే కనిపిస్తుంది, కాని వాస్తవానికి చాలా కష్టం. సమాధానం స్పష్టమైందికాదు. దానం అంటే ఒకదానిని ''వదులుకోవడం'' అని వంచింపబడడమని, పరిత్యాగం చేయడమని అనుకొంటాము-ఈ అపార్థం బాగా ప్రాచుర్యంలో ఉంది. ఇతరులను స్వార్థానికి ఉపయోగించుకోవడం, వారి నుండి అందినదెల్లా లాక్కోవడం, లాక్కొన్న దానిని కూడబెట్టడం లాంటి స్థితిని దాటి ఎదగని మనిషి దృష్టిలో ''ఇవ్వడం'' అంటే అర్థం ఇదే. విపణి లక్షణం ఇవ్వడానికి ఒప్పుకొంటుంది కాని అంతకు సరిపడ ప్రతిఫలం ఏదైన

ప్రేమ, ధర్మం, సత్యం, న్యాయాలకు దేవుడు ప్రతీక అయితే - మనిషిలాంటి దేవుడు కాకపోతే - నేను వాటినే ప్రేమిస్తాను. అంటే ప్రేమను ప్రేమిస్తున్నానని అర్థం, ధర్మాన్ని పూజిస్తున్నానని అర్థము. ఇప్పుడు పై ప్రశ్నను, ఫ్రామ్, ఇలా అడగమంటాడు: ''దేవుడు ఏఏ అంతిమ విలువలకు ప్రతీక అవుతుందో - ఆ అంతిమ విలువలు, దైవభావన ఏఏ అనుభవాలను రేకెత్తిస్తుందో - ఆ అనుభవాలు చచ్చిపోయాయా?'' లేక 'దేవుడు మరణించాడా?' అని అడిగేదానికంటె 'మానవుడు మరణించాడా'' లేక 'మానవత మరణించిందా?'' అని నేటి ప్రపంచాన్ని అడగడం సమంజసంగా ఉంటుందంటాడు ఫ్రామ్. 'you shall be as gods'లో ఫ్రామ్, చెప్పిన దైవభావనలోని పరిణామం - అసూయా పరుడైన భగవానుడు రాజు ఎలా అయిందీ, చివరికతడు నామరహితుడైన దేవుడెలా అయిందీ, ఈ నామరహితుడు మనిషిని తీర్చిదిద్దే సూత్రాలకు ప్రతీక ఎలా అయిందీ, దీనికి విపర్యయంగా మానవుడు, 'దేవునికి, మీ విధేయుడైన సేవకుని' నుంచి తన చరిత్రకు తాను కర్తకాగల స్థితికి ఎలా చేరింది - వివరించాడు.

ఫ్రామ్‌ను అత్యంతంగా ప్రభావితం చేసిన వారిలో బుద్ధుడు, క్రీస్తు, మార్క్స్, ఫ్రాయిడ్ ముఖ్యులు. ఫ్రాయిడ్ సహజాత మానవుని (related man)కి బుద్ధ క్రీస్తుల పరిణత కరుణ ప్రేమలను రంగరించి నూతన మానవీయమానవుని ఫ్రామ్ ఆవిష్కరింపజేశాడు.

ఫ్రాయిడ్ మనోవిశ్లేషణం ఎందుకు సంకట స్థితి (crisis)లో పడింది వివరిస్తూ, ఫ్రాయిడ్ అనుయాయులు అతనిలో సమూల పరివర్తన (radical change) లక్షణాన్ని గుర్తించకుండా తప్పుదారిలో అనువృత్తి (conformist) లక్షణాన్ని మాత్రమే గ్రహించారు. ఫ్రాయిడ్ అహేతుక శాస్త్రాన్ని (Science of the irrational) ప్రవచించి కోపర్నికస్ వలె, విప్లవాన్ని తీసుకొచ్చాడు. అచేతనం (Unconscious) రచనలలో, కలలలో,

ముట్టాలి. పుచ్చుకోకుండ ఇవ్వడమంటే అతడు మోసపోయినట్లే. సృజనాత్మక శక్తి లేకుండ ఎదిగిన వారు ఇవ్వడం వల్ల దరిద్రులమవుతామని భావిస్తారు. ఈ రకం మనుషులలో ఎక్కువమంది ఇవ్వడానికి ఒప్పుకోరు. కొంతమంది ఇవ్వడాన్ని పరిత్యాగం క్రింద జమకట్టి దానిని గొప్ప గుణం చేస్తారు. ఇవ్వడం బాధాకరం అనే కారణాన వాళ్ళు ఇచ్చి తీరాలని భావిస్తారు; దానంవల్ల వాళ్ళు త్యాగమూర్తులవుతారు కనుక ఇవ్వడం గుణం అవుతుంది. వారి ప్రకారం ''పుచ్చుకోవడం కంటె ఇవ్వడం మంచిది.'' అంటే అర్థం ''సంతోషాన్ని అనుభవించడం కంటె నష్టంతో బాధపడడం మంచిది.''

సృజనాత్మకశీలికి 'దానం' అంటే అర్థమేవేరు. ఇవ్వడంలో అతని శక్తి ఎంతో తెలుస్తుంది. ఇవ్వడంలో, నేను ఏమిటో, నాబలం సంపత్తి సత్తాలు ఏమిటో తెలుస్తాయి. ఉవ్వెత్తుగా లేచిన సచేతనతానుభవం నాకు ఎంతో సంతోషాన్నిస్తుంది. నాలోనుంచి ఏదో ఎక్కువై పొంగి, పొరలిపోతున్నట్లు, అది సద్వినియోగం అవుతున్నట్లు, నాకు అనిపిస్తుంది. నేను సజీవుడననే వన్న భావం కలుగుతుంది. ఇలా అనిపించటం వల్ల నాకు ఎంతో సంతోషం కలుగుతున్నది. ఇవ్వడం పుచ్చుకోవడం కంటే సంతోషకరమైంది. అది నష్టపోయినందువల్ల దానకర్మలో నాలోని సజీవత్వం వ్యక్తమవుతుంది.

ఈ సూత్రాన్ని కొన్ని విశిష్ట విషయాలకు అనువర్తింపజేసి, దాని ప్రమాణికతను గుర్తించడం కష్టం ఏమీకాదు. దీనికి సంబంధించిన ప్రాథమిక దృష్టాంతం లైంగికరంగంలో ఉంది. మగవానికి ''లైంగిక పరాకాష్ట'' దానం (ఇవ్వడం) లోనే ఉంది. మగవాడు తనను తాను, తన అంగాన్ని స్త్రీకి అర్పిస్తాడు. విసృష్టి (భావప్రాప్తి) సమయంలో అతడు షండుడు కాకపోతే దానిని ఇవ్వకుండా ఆగలేడు. ఇవ్వలేకపోతే అతడు షండుడు. విషయం కొంచెం సంక్లిష్టమైన స్త్రీకి ఇదే వర్తిస్తుంది. ఆమె తనను తాను పురుషునికి అర్పించుకుంటుంది. ఆమె తన స్త్రైణ కేంద్రానికి ద్వారాలు తెరుస్తుంది.

రోగలక్షణాలలో, నిత్యజీవితాలలో దొర్లే పొరపాట్లలో ఎలా బహిర్గతమయ్యేది వివరించాడు. మనిషి ప్రవర్తనపై అచేతనం ప్రభావాన్ని వివరించాడు. ఇంత వరకు ఫ్రాయిడ్ తో ఫ్రామ్ ఏకీభవిస్తాడు. విక్టోరియా యుగంలో లైంగికతను అణచివేయడం ఆరోగ్యమని భావించిన సమాజాన్ని విమర్శించి, ఫ్రాయిడ్ తన సిద్ధాంతానికి లైంగికతను కేంద్రంగా చేసుకొంటే, ఆ లైంగికతను పట్టుకొని ఇప్పుడు వేళ్ళాడడం కుదరదంటాడు ఫ్రామ్. ఎందుకంటే విక్టోరియా యుగపు సమాజం ఇప్పుడు లేదు. లైంగికత అణచివేత లేదు. అదొక వినిమయ వస్తువు (Commodity) అయిపోయింది. వెలకు దొరుకుతోంది. ఇప్పటి సమాజంలో కొత్త సమస్యలు వచ్చాయి. రాజకీయాలు నిర్వీర్యమయ్యాయి. వ్యవస్థామానవుడు (Organisation man) ఆవిర్భవించాడు. మధ్య తరగతి భద్రత ఎగిరిపోయింది. ఇది వ్యాకులతాయుగ (Age of anxiety) మైంది. వైమనస్యం (alienation), ఒంటరితనం (loneliness), వేర్పాటు (Separation) ఈ యుగలక్షణాలు. తను సృజించిన యంత్రానికి మానవుడు బానిస అయ్యాడు. యంత్రంలో భాగమయ్యాడు. అతడొక వినిమయవస్తువు (Commodity) అయ్యాడు. మార్కెట్టులో ఏ లక్షణాలకు రేటు పలుకుతుందో ఆ లక్షణాలనే పెంపొందించుకొంటున్నాడు. మానవ సంబంధాలను 'అంగడినీతి' (rules of the market) ఏలుతోంది. తల్లి-బిడ్డ సంబంధాలను ఆర్థిక విలువలు నిర్ణయిస్తున్నాయి. మార్పులేని మనోవిశ్లేషణం (Psychoanalysis) మారిన ఇటువంటి ప్రపంచానికి ఏమి చేయగలదు? అందుకని మనోవిశ్లేషణం ఈ మార్పులకనుగుణంగా మారాలంటాడు ఫ్రామ్. లైంగికతకు మారు వైమనస్యం, ఒంటరితనం మనోవిశ్లేషణానికి కేంద్రాలు కావాలన్నాడు.

నూతన మానవుని, వినిమయ వస్తువుగా కాక, మనిషిని మనిషిగా ప్రతిష్ఠించే ప్రయత్నంలో బెర్న్ ఫీల్డ్, విల్ హెల్మ్ రీక్ లకు వలె ఇతడు అదే బాటలో ముందడుగు వేశాడు. ఫ్రాయిడ్ అచేతన సిద్ధాంతాన్ని

పుచ్చుకొంటూనే ఆమె ఇస్తుంది. ఈ విధంగా ఆమెకు అర్పించుకొనే శక్తి లేకపోతే (ఇచ్చుకోలేకపోతే), పుచ్చుకోవడం మాత్రమే చేయగలిగితే, ఆమె జడురాలవుతుంది. 'ఈ దాన' ప్రక్రియ ఆమెలో మరొకసారి సంభవిస్తుంది. ఇది, ప్రేయసిగా కాక, తల్లిగా జరుగుతుంది. తనలో పెరుగుతున్న బిడ్డకు తనను తాను అర్పించుకొంటుంది; శిశువుకు పాలను, తన ఒంటిలోని వేడిని దానం చేస్తుంది. వీటిని ఇవ్వకపోవడం ఆమెకు బాధాకరంగా తయారవుతుంది.

భౌతిక వస్తువుల విషయంలో దానం చేయడమంటే సంపన్నంగా ఉండడము. ఎక్కువ ఉన్నవాడు కాదు సంపన్నుడు, ఎక్కువ ఇచ్చేవాడు. అతనికి ఎంత ఉన్నప్పటికీ, కూడబెట్టేవానికి, ఎప్పుడూ ఏదో కొంత పోతుందేమోనన్న వ్యాకులతతో నిద్రపట్టదు. అటువంటప్పుడు అతడు నిర్వీర్యుడు, దరిద్రుడే అవుతాడు గాని మరొకటి కాదు. తనను తాను దానం చేసుకోగల శక్తిగలవాడే సంపన్నుడు. తనను తాను ఇతరులకు అర్పణ చేసుకొన్నప్పుడు కలిగే అనుభవం అతనికే దక్కుతుంది. భౌతిక వస్తువులను ఎవరైనా కొంతవరకే ఇవ్వగలరు. తన జీవితావసరాలను మించి ఎవడూ ఇవ్వలేడు. అటువంటప్పుడు వస్తువులను ఇవ్వడంలో ఆనందం ఎలా వస్తుంది? ''ఎంత ఉంటే కనీస జీవితావసరాలకు సరిపోతుంది?'' అనే విషయం అతని ఆస్తిపాస్తుల మీద ఆధారపడి ఉంటుందా? అది శీలం మీద ఆధారపడి ఉంటుందని మన నిత్యానుభవం చెబుతుంది. భాగ్యవంతుల కంటె పేదవారు ఇవ్వడానికి ఎక్కువగా ముందుకు వస్తారనే విషయం అందరికి తెలుసు. అయినప్పటికీ, పేదతనం ప్రత్యక్షంగా బాధను కలిగించడమేకాక, దానంలోని ఆనందాన్ని పేదవారికి దక్కనీయదు.

దానప్రక్రియ అసలు స్థానం భౌతికసంపదలో లేదు. దాని కేంద్రం ప్రత్యేకంగా మానవ విషయాలలో ఉంది. ఒక వ్యక్తి మరొక వ్యక్తికి ఏమిస్తాడు? తనను తాను ఇచ్చుకొంటాడు, తనకున్న దానిలో కెల్ల అత్యంతవిలువైన తన జీవితాన్ని ఇస్తాడు. దీని అర్థం అతని జీవితాన్ని రెండవవానికి బలిచేస్తాడని

గతితార్కిక పద్ధతిపై సామాజిక ఆరోగ్యదృష్టి (health of the Society),తో కాకుండా మానవతారోగ్య (health of the humane) దృష్ట్యా - అంటే నిండు జీవితాన్ని నిర్భయంగా గడపడానికి - సవరించాలన్నాడు ఫ్రామ్.

భవిష్యత్తులో అధికజనం బూజుపట్టి, అలసిపోయిన ఆలోచనా మూసలకు, విషయాలకు అంటుకుపోయి తాము అనుకొన్నదే సరైనదనే భ్రాంతిలోపడే ప్రమాదముంది. తమకున్న వ్యవహార జ్ఞానాన్ని (Commonsense), అందులోని కాల్పనిక భాగాన్ని (fictitious element) పట్టించుకోకుండ, వివేచన (reason) అని భావించే ప్రమాదంలో పడతారు. ఈ హెచ్చరికను గుర్తుపెట్టుకొని 'గానుగెద్దు' ఆలోచనల నుంచి బయట పడమని, రోకంటిపాట పాడవద్దని, పరుల భావాలను చూచి అవి తనలో ఎప్పటినుంచో ఉన్నాయని, అవి అసలు తనవేననే అలసత, గాడిలో పడవద్దని కోరతాడు. ★

## మనవి

**యిద్ ''స్టయిల్''లో మిసిమిని ప్రచురించుట ఆర్థికంగా భారంగా వుంది. 1993 ఏప్రిల్ నెలనుండి విడిప్రతి రూ.5 లు. వార్షిక చందా రూ. 60 లు చేస్తున్నాము. ప్రోత్సహించ ప్రార్థన.**

- సంపాదకుడు

కాదు; తనలో ఉన్న సజీవమైన దానిని (సృజనాత్మకతను ఉత్పాదకతను) రెండవవానికి ఇస్తాడు; తన సంతోషాన్ని ఇస్తాడు; తన సంతోషాన్ని, అర్థాన్ని, అవగాహనను, విజ్ఞానాన్ని, దుఃఖాన్ని —తనలో సజీవమైన ప్రతిదానిని అభివ్యక్తీకరణాన్ని, అవిష్కారాన్ని అతడు ఇస్తాడు. ఈ విధంగా తన జీవితాన్ని ఇవ్వటంలో రెండవవాన్ని సంపన్నుని చేస్తున్నాడు. తన సజీవత్వాన్ని పెంచుకొంటూ రెండవవాని సజీవత్వాన్ని పెంచుతున్నాడు. ఇందులో తిరిగి పుచ్చుకోవాలనే కోర్కెలేదు. అసలు ఇవ్వడమే పరమానందం. ఇలా ఇవ్వడంలో రెండవవానిలో ఎదో ఒక అంశం జాగృతి కాకమానదు. అలా జాగృతమైన అంశం తిరిగి మొదటివాని మీదికి ప్రతిబింబిస్తుంది. నిజమైన ఈ ఆదాన ప్రదానాలలో తనకు ఇవ్వబడిన దానిని పరిగ్రహించకుండ ఉండలేదు. ఇవ్వడమంటే రెండవవానిని గూడ దాతను చేయడమే. అప్పుడు వారిద్దరూ కలిసి కొత్తగా జీవం పోసిన అంశం నుండి (జాగృతమైన దానినుండి) లభించిన సంతోషాన్ని పంచుకొంటారు. దానక్రియలో నూతన చైతన్యం ఇద్దరిలోను ఆవిర్భవిస్తుంది. ఇలా ఆవిర్భవించిన నూతన చైతన్యానికి ఇద్దరూ కృతజ్ఞులై ఉంటారు. ప్రత్యేకంగా దీనినే ప్రేమపరంగా చెప్పాలంటే: ప్రేమ అనేది ప్రేమపుట్టించే ఒక శక్తి; నపుంసకత్వం (షండత్వం) ప్రేమను పుట్టించలేని అశక్తత. మార్క్స్ దీనిని చాల అందంగా చెప్పాడు; మనిషిని మనిషిగా చూడు, ప్రపంచం తోటి అతని సంబంధాన్ని మానవీయమైన దానిగా చూడు. అప్పుడే ప్రేమకు ప్రేమను, విశ్వాసానికి విశ్వాసాన్ని మాత్రమే మారకం వేయగలవు. కళను ఆనందించాలంటే నీవు కళాభ్యాసం చేసి ఉండాలి. ఇతరులమీద నీ ప్రభావం పడాలనుకొంటే, వారిని నీవు ఉద్దీపింపజేయ గలిగిన వాడివై ఉండాలి. మనిషితోను, ప్రకృతితోను నీకున్న సంబంధాలన్నీ నీ సంకల్పాను గుణమైన అసలు వ్యక్తిగత జీవితాన్ని ప్రతిబింబించాలి. నీ ప్రేమ ఇతరులలో ప్రేమను రేకెత్తించ జాలనట్లయితే, నీప్రేమ ప్రేమను పుట్టించలేక పోయినట్లయితే, ప్రేమైకజీవిగా నీవు గావించిన జీవితాభివ్యక్తీకరణం

(Expression of life) నిన్ను ప్రియునిగా చేయలేకపోయినట్లయితే, అటువంటి నీ ప్రేమ నిర్వీర్యమైంది, దురదృష్టకరమైంది.'' కాని 'ఇవ్వడమంటే పుచ్చుకోవడం', అనేది ప్రేమ విషయంలో కాక ఇతరత్రా గూడ జరుగుతుంది. ఆచార్యునికి అంతేవాసులు బోధిస్తారు; నటుని ప్రేక్షకులు ఉత్తేజితుని చేస్తారు; మనోవిశ్లేషకుని రోగి బాగుచేస్తాడు. మానవులు ఒకరినొకరు వస్తువులుగా చూడక, వారిమధ్య సంబంధాలు అకృత్రిమాలై, సృజనాత్మకాలైతే ఇదే జరుగుతుంది.

దానక్రియగా ప్రేమసామర్థ్యం (capacity to love as an act of giving), వ్యక్తిశీలాన్ని బట్టి ఉంటుందనే విషయం నొక్కి చెప్పవలసిన అవసరం లేదు. ముందుగా అతని శీలం సృజనాత్మకత వైపు వాలి ఉండాలి. ఇలా వాలి ఉండడంవల్ల, వ్యక్తి ఆలంబనాన్ని, స్వానురాగశక్తిమంతత్వాన్ని (narcissistic omnipotence), ఇతరులను దోచుకోవాలనే కోర్కెను, లేదా కూడబెట్టాలనే కోర్కెను అధిగమించి, మానుషశక్తులలో విశ్వాసాన్ని, లక్ష్యసాధనలో స్వశక్తిమీద నమ్మకాన్ని ఆర్జిస్తారు. ఈ లక్షణాలు అతనిలో కొరవైనకొలది తనను తాను అర్పించుకోవడానికి భయపడతాడు - అందుకని అతనికి ప్రేమంటే భయము.

మాతృప్రేమను పరిశీలించినట్లయితే అందులో సాదరత ఉన్నట్లు స్పష్టమవుతుంది. బిడ్డంటే ఆమెకు ఆదరం లేకపోయినా, స్నానాన్న పానాదులను సరిగా చూడలేకపోయినా, ఆలనా పాలనా లేకపోయినా, భౌతిక సాంత్వనం కలిగించలేకపోయినా, ఆమెప్రేమ నిర్వ్యాజమైనదని అనలేము. అమె బిడ్డను ఆదరంతో చూస్తే మనం ఆమె ప్రేమను చూచి ముగ్ధులమవుతాము. జంతువుల, పుష్పాలయెడ ప్రేమకూడ ఇలాంటిదే. పూవులంటే తనకెంతో ఇష్టమని చెప్పిన ఒక స్త్రీ, మొక్కలకు నీరుపోయడం మరిచిపోతే ఆమె ప్రేమను విశ్వసించము. జీవితంమీద మనం చూపించే క్రియాత్మక అపేక్ష ప్రేమ; ఈ క్రియాత్మక అపేక్షలేని చోట ప్రేమలేదు.

ఆదరం, అపేక్షలలో ప్రేమకు సంబంధించిన మరొక అంశం ఉంది. అది బాధ్యతకు సంబంధించింది. ఈనాడు బాధ్యతను 'విధి' అనుకొంటున్నారు. బాధ్యత అంటే, బయటినుంచి దేనినో తెచ్చి ఒకనిమీద రుద్దడం అని అర్థం చెబుతున్నారు. కాని బాధ్యతకు అసలు అర్థం సంపూర్ణ ఐచ్ఛిక కర్మ. మరొక మానవుని వ్యక్త లేదా అవ్యక్త అవసరాలకు నేను చేసే ప్రతిస్పందనం. బాధ్యత వహించడమంటే, ప్రతిస్పందించే సామర్థ్యంతో సిద్ధంగా ఉండడము.

ప్రేమలో మూడవ రకం గౌరవము. దీని మూలాన కాకపోతే బాధ్యత తొందరలోనే ఆధిపత్యం, ధాష్టీకం క్రిందకు దిగజారుతుంది. గౌరవం అంటే భయ, సంభ్రమాలుకాదు. ఈ పదం ధాత్వర్థంలో (respicere=tolook at) ఒక వ్యక్తిని యథాతథంగా గ్రహించడాన్ని, అతని అనన్య మూర్తిమత్వాన్ని గుర్తించడాన్ని సూచిస్తుంది. గౌరవం అంటే ఎదుటివాడు యథాభూతంగా ఎదగాలనే అపేక్ష. కనుక గౌరవంలో దోపిడీ లేదు. నేను ప్రేమించే వ్యక్తి నాకు బానిస కావాలని కోరను. అతడు అతనికి సహజమైన మార్గంలో ఎదగాలని కోరుకుంటాను. నేను ఒక వ్యక్తిని ప్రేమించడం జరిగితే ఆ వ్యక్తితో ఏకమైపోతాను. అతడు నాచేతిలో ఉపకరణం కావాలని కాక, అతడెలా ఉంటే అలాగే ఏకమవుతాను. స్వాతంత్ర్యం ఉన్నప్పుడే గౌరవం ఉంటుందనే విషయం సుస్పష్టము. ఊతకర్రల సహాయం లేకుండా నేను నిలబడి నడువగలిగినప్పుడు ఎవరిని దోచుకోకుండ ఉండగలిగినప్పుడు, ఎవరిపై ఆధిపత్యం చెలాయించకుండ ఉండగలిగినప్పుడు, నాకు గౌరవం ఉంటుంది. స్వేచ్ఛ ఉంటేనే గౌరవం: "l'amourest l' enfant de na liberte" అనే ఫ్రెంచి ప్రాచీన గీతం చెబుతున్నట్లు ప్రేమ స్వేచ్ఛ శిశువు. ప్రేమ స్వేచ్ఛ బిడ్డగాని అధికారంబిడ్డ కాదు.

అవతలి వ్యక్తిని తెలుసుకోకుండ గౌరవించడం సాధ్యం కాదు. ఆదర్శం, బాధ్యతలకు అవగాహన మార్గదర్శకం కాకపోతే అవి గుడ్డివైపోతాయి. అపేక్ష ప్రేరితం కాని జ్ఞానం శూన్యం అవుతుంది. జ్ఞానానికి అనేక పొరలు ఉన్నాయి, ప్రేమలోని భాగమైన అవగాహన, పైపైనే ఆగిపోక, అంతర

కుహరంలోకి చొచ్చుకుపోతుంది. నామీద నాకున్న అపేక్షను చీల్చుకొని, అవతలి వ్యక్తిని నాలాగే చూడగలిగినప్పుడు ఇది సాధ్యమవుతుంది. ఉదాహరణకు ఒక వ్యక్తి, పైకి కనిపించకపోయినా, అతడు కోపంగా ఉన్నట్లు గ్రహిస్తాము. అలాగే ఇంకొంచెం లోతుకుపోయి, అతడు వ్యాకులచిత్తంతో, ఒంటరితనంతో, అపరాధభావనతో కుంగిపోతున్నాడని తెలుసుకొంటాము. అప్పుడు, అతని కోపం, లోపల ఉన్న బాధకు బాహ్యరూపమేగాని మరొకటికాదని గ్రహిస్తాము. మనం అతనిని కోపిస్తున్న వ్యక్తిగాకాక, వ్యాకుల సంభ్రమ చిత్తునిగా, బాధితునిగా అర్థం చేసుకొంటాము. ప్రేమతో అవగాహనకు మరొక ప్రాథమిక సంబంధం ఉంది: ఏకాంతమనే కారాగారాన్ని దాటి తోటి మానవులతో కలిసిపోవాలనే అవసరము. ''మానవ రహస్యాన్ని'' (Secret of man) భేదించాలనే మరొక అవసరంతో ఇది ముడివడిఉంది. జీవశాస్త్రం ప్రకారం జీవితం పరమాద్భుతరహస్యమైతే, మానుష్యకంగా మానవుడు తనకు తాను అంతులేని రహస్యం, తోటివానికి అసలే అంతుపట్టని మర్మము. మనం మనలను ఎరుగుదుము, అయినా ఎరుగము. ఎంత ప్రయత్నించినా మనలను మనం తెలుసుకోలేకపోతున్నాము. మనం తోటివారిని ఎరగుదుము, అయినా ఎరగము. ఎందుకంటే మనం వస్తువులం కాము, వారూ వస్తువులు కారు. మన లేదా ఇతరుల 'ఉనికి' అంతరాంతరాలలోకి పోయిన కొలది అది అందకుండ తప్పించుకుపోతుంది. అయినా ఆత్మ రహస్యాన్ని భేదించాలనే వాంఛను, అంతరాంతరాలలో ఉన్న 'అతడు' (he) అనే కేంద్రకములోకి చొచ్చుకుపోవాలనే కోర్కెను నిగ్రహించుకోలేకపోతున్నాము.

ఆ రహస్యాన్ని తెలుసుకోవడానికి ఒక మార్గం ఉంది. అది సాహసికమైనది: అది అవతలి వ్యక్తిని మన ప్రభావానికి పూర్తిగా లోను చేయడము. ఆ ప్రభావం ఎలా ఉండాలంటే మనం కోరింది అతడు చేయాలి. మనం ఆశించిన అనుభూతి అతనికి కలగాలి, మనం అనుకొన్నట్లు అతడు ఆలోచించాలి. ఆ ప్రభావం అతనిని ఒక వస్తువుగా, మన ఆధీన విషయంగా, సమూలంగా మార్చివేయగలిగినదై ఉండాలి. ఇతరులను విపరీతంగా హింసించాలనే వాంఛలో, వారిని అలా పీడించే సామర్థ్యంలో, రహస్యాన్ని కక్కించడానికి క్రూరంగా హింసించి, బలాత్కారం చేయడంలో - అంటే అత్యంత పరపీడనకామంలో - ఈ మానవ మర్మ భేదనవాంఛ చరమస్థాయి నందుకొంటుంది. మానవ రహస్యాన్ని చోదించాలనే ఈ తపనలో హింస విధ్వంసాల లోతు, తీవ్రతలను గాలించాలనే ప్రాథమిక వాంఛ ఉంది. ఈ వాంఛ అతనిలోను ఉంది.

'మర్మాన్ని' తెలుసుకోవడానికి ఉన్న మరొక మార్గం ప్రేమ. నా ఈ మర్మాన్వేషణ తృష్ణను ఉపశమింపజేసేట్టుగా అవతలి వ్యక్తి క్రియాత్మకంగా నాలోకి చొచ్చుకు (Penetration) వచ్చి సంలీనం కావడమే ప్రేమ. అటువంటి సంలీనక్రియలో నిన్ను నేను తెలుసుకొంటాను, నన్ను నేను తెలుసుకుంటాను. అందరిని తెలుసుకొంటాను - అయినా నాకు ఏమీ ''తెలియదు''. జీవిత రహస్యాన్ని తెలుసుకోవడానికి మానవునికి ఉన్న ఏకైక మార్గమైన సంలీనానుభవం ద్వారా నేను తెలుసుకొంటాను. బుద్ధిద్వారా ఆ సత్యాన్ని చేరలేను. మర్మాన్ని ఛేదించాలనే వాంఛే పరపీడన కామానికి మూలము. పీడించడానికి ముందు నాకు ఎంత తెలుసో ఇప్పుడూ అంతే తెలుసు. అతనిని ఏ ముక్క కాముక్కగా చీల్చివేశాను. అయినా అతడు నాశనం అయ్యాడేతప్ప నాకు రహస్యం అంతుబట్టలేదు. ప్రేమ ఒక్కటే దానికి బాట. సంలీనంలోగాని అది నా అన్వేషణను సంతృప్తి పరచలేదు. ప్రేమించి, నన్ను నేను అర్పించుకొని, అవతలి వానిలోకి చొచ్చుకుపోయి నన్ను నేను తెలుసుకొంటాను, నన్ను నేను కనుగొంటాను. ఇద్దరిని అర్థం చేసుకొంటాను, మానవుణ్ణే దర్శిస్తాను.

మనం మనల్ని తెలుసుకోవాలి, ఇతరులను తెలుసుకోవాలి అనే కోర్కెను ''నిన్ను నీవు తెలుసుకో'' ''ఆత్మానంవిద్ధి''(know thyself)అనే డెల్ఫివాక్యం సూచిస్తుంది. మనోవిజ్ఞానానికి అసలు ఊటబుగ్గ ఇదే. మానవుని పూర్తిగా అర్థం చేసుకోవాలంటే, అతని అంతరాంతరాలలోకి

తొంగిచూడాలంటే మామూలు జ్ఞానం ద్వారా సాధ్యంకాదు. అంటే దానిని బుద్ధిద్వారా ఎన్నటికి చేరలేము. మనిషిని గురించి ఇప్పుడు తెలిసిన దానికంటె ఇంక వెయ్యిరెట్లు తెలిసికొన్నా, మనం ఎన్నటికి మానవునిలోని అగాధాన్ని చేరలేము, తోటి మానవుడు మనకు ప్రశ్నగా మిగిలినట్లే మనకు మనం ప్రశ్నగా మిగిలిపోతాము. సంపూర్ణజ్ఞానాన్ని సంపాదించే ఒకే మార్గం ప్రేమకర్మ: ఈ ప్రేమకర్మ ఆలోచన కతీతము, దీనిని మాటలతో వ్యక్తం చేయలేము. ప్రేమ అంటే సంలీనానుభవంలోకి సాహసంతో మునకలు వేయడము. ఏది ఎలాగున్న ఆలోచన ద్వారా లభించే జ్ఞానం అంటే మనోవిజ్ఞానం (Psychology), ప్రేమ ద్వారా సంపూర్ణజ్ఞానాన్ని పొందటానికి అవశ్యక ఉపాధి. అతని తత్త్వాన్ని అర్థం చేసుకోవాలన్నా అంతకంటె అతని గురించి నాకున్న అహేతుక వక్రచిత్రాన్ని, భ్రమను తొలగించుకోవాలన్నా, అతనిని నన్నుగూడ వస్తుగత దృష్టితో చూడగలిగినప్పుడే, అతని తత్త్వాన్ని ప్రేమ కర్మలో తెలుసుకోగలుగుతాను.

మానవుణ్ని అర్థం చేసుకోవడం, దేవుని అర్థం చేసుకోవడం- రెండూ సమాంతర సమస్యలే. అనూచానంగా వస్తున్న పాశ్చాత్య ఆస్తిక్య విద్యలో బుద్ధి ద్వారా దేవుని తెలుసుకోవాలని, అతన్ని నిర్వచించాలనే ప్రయత్నం జరిగింది. అసలు వారు బుద్ధిద్వారా దేవుని పొందవచ్చని భావించారు. ఏకదేవతావాదం (Monotheism) నుంచి ఆవిర్భవించిన మార్మికవాదం (Mysticism)లో బుద్ధి ద్వారా దేవుని తెలుసుకొనే ప్రయత్నాన్ని విరమించారు. దాని స్థానంలో దైవసాయుజ్యానుభవాన్ని నిలిపారు. ఇందులో దివ్యజ్ఞానానికి స్థానంగాని, ఆవశ్యకతగాని లేదు.

ఇంతవరకు, 'మానవుడు' ఒంటరితనం నుంచి బయటపడడం, సాయుజ్యవాంఛను సంతృప్తిపర చడం ప్రేమ,' అని చెప్పుకుంటూ వచ్చాను. సాయుజ్యావసరం సర్వసామాన్యమైంది, సర్వసత్తాక మైంది. ఇంతకంటె విశిష్టమైన జీవసంబంధమైన మరొక అవసరం ఉంది. స్త్రీ, పురుష ధ్రువాల మధ్య సంయోగ వాంఛ. ఈ ధ్రువాభిసరణ భావనను పురాణంలో చక్కగా వివరించారు. మొదటిలో స్త్రీ పురుషుల మధ్య భేదం లేదు. తరవాత వారు సగానికి ఖండితులయ్యారు. ఆనాటినుంచి ప్రతి మగవాడు భ్రంశమైన తన స్త్రీ భాగం కోసం, దాని పొందుకోసం, ఆక్రోశిస్తున్నాడు. (ఆడమ్ ప్రక్కటెముక నుంచి స్త్రీ మలచబడ్డదనే బైబిలు కథ ఇదే మౌలిక లింగైక్యతా భావాన్ని ప్రవచించింది. కులీన వ్యవస్థలో స్త్రీకి పురుషుని తరవాత, రెండవస్థానమే లభ్యమైంది). పురాణకథ అర్థం సుస్పష్టమే. లైంగిక ధ్రువాభిసరణం (Sexual Polarisation) మనిషిని ఒక నిర్దిష్ట మార్గంలో-స్త్రీ పురుష సంయోగం-సాయుజ్యంవైపు నడిపిస్తుంది. ప్రతి పురుషునిలోను, ప్రతి స్త్రీలోను స్త్రీ-పురుష ధ్రువాభిముఖత ఉంటుంది. శారీరక ధర్మశాస్త్రం ప్రకారం స్త్రీ పురుషులిరువురిలో ఇద్దరి హార్మోనులు ఎలా కలిసి ఉన్నాయో, అలాగే, మనో విజ్ఞాన శాస్త్ర ప్రకారం స్త్రీ పురుషులిరువురులోను ద్వైలైంగికత (Bisexuality) ఉన్నది.

అదేరకమైన స్త్రీ-పురుష ధ్రువాభిసరణ సూత్రం ప్రకృతిలోను ఉంది. జంతువులలో, మొక్కలలో నేకాక, రెండు ప్రాథమిక ప్రకార్యాలలో (functions)- పరిగ్రహణ ప్రవేశనాలలో - అది కనిపిస్తుంది. భూమి-వాన, నది-సముద్రం, రాత్రి-పగలు, చీకటి-వెలుతురు, పదార్థం-ఆత్మల జంటలలో ఉన్న ధ్రువాభిముఖత అదే. ఈ భావాన్నే ముస్లిమ్ కవి, మార్మికుడు (mystyci) అయిన రూమీ (Rumi) చాల అందంగా చెప్పాడు. (సశేషం)

Indeed, with the end of the cold war and a defunct nonaligned movement, India has had to hurriedly rethink its foreign policy, and with it change the old mindset of taking stances against colonisation and imperialism as key functions of our foreign missions.

# కన్యాశుల్కం - పాత్ర పరిశీలన

- శ్రీపాద కామేశ్వరరావు

## 3. అగ్నిహోత్రావధాని

ఈతడు కథానాయకుడనవచ్చును. జటావల్లభుడైన స్వాధ్యాయవేత్త. అతికోపకుడు. ఎదుటివారి నెవరినీ లక్ష్యపెట్టక తన మాట చెల్లించుకోవడమే ఇతనిపట్టు. ఇతని అభిప్రాయములు వింతగా నుండును. ఎవరో ఇద్దరు పిల్లవాళ్ళు ఇంగ్లీషు చదువుకుంటూంటే వాళ్ళకు ప్రాణము మీదికి వచ్చిందట, అందుచేత ఆ విద్య తన కచ్చిరాదట: తన భార్య పట్టుచేత కుర్రవానికి చదువు చెప్పిస్తున్నాడేగాని కొంప గుండమౌతున్నదని గునుస్తూనే ఉన్నాడు. కదులోభి ఔటచేత ఇంటి కెవ్వరూ రావడమతనికి కిట్టదు. గిరీశం రాగానే ''ఇతని వైఖరి చూస్తే ఇక్కడ బస వేసేటట్టు కనబడుతూంది. మా యింట్లో భోజనం ఎంతమాత్రం వీలుపడ'' దని కేకలు వేసినాడు. పుస్తకాలకి సంవత్సరానికి పదిహేను రూపాయల వుతుందని వినగానే ''ఒకపైసా ఇవ్వను, వేదమంతా ఒక దమ్మిడీ ఖర్చు లేకుండా నేను చదివినా''న న్నాడు. శ్రీఘ్రకోపికాని ఇతడు దీర్ఘకోపికాడు. తన కోపము తానెరిగి తడబడేవాడు. ''చూశారా, గిరీశంగారూ, కొంచెము నాకు ప్రథమ కోపము. ఎవరో తెలియకుండా అన్నమాటలు గణించకండేం'' అని పశ్చాత్తాపపడి వేడుకున్నాడు.

ఆడపడచులను అమ్ముకోవడం శిష్టాచారమట; తను వంశములో మూడు తరాలబట్టి ఇది జరుగుతు న్నదట, ''శుల్కము పుచ్చుకోకపోతే మగడు చచ్చిన తరువాత పిల్లగతి ఏమి కాగలదు'' అని ఇతని వాదన. ఎవరేనా ''నీవు పిల్ల నమ్మినా''వంటే ఇతనికి ఒళ్ళుమంట. అది తప్పని ఎరిగీ ద్రవ్యాశతో అలాగు చేయకుండా ఉండలేదు. సుబ్బిని రు.1800 లకు అమ్మ నిశ్చయించినాడు. ఆ సొమ్ము పెట్టి కొడుకు పెళ్ళి చేస్తాడట.

సంఘ సంస్కరణ ఇతనికి పీడకల, శుల్కము మానుకోలేదు. చిన్న పిల్లలను పెద్దవాళ్ళకి కట్టపెట్టక పోతే శుల్కము లభించదు. వితంతు వివాహమంటే వెగటు. దావాలంటే తగని సరదా; చేతిలో సొమ్ము లేకుంటే నగైనా పెట్టి గ్రంథము నడిపిస్తాడు. ఇరుగు పొరుగు వారితో దెబ్బలాడి గోడహక్కులు నిలువబెట్టుకున్నాడు. దావాలో వీగితే యజమానులు లంచము పుచ్చుకొన్నారని నిందిస్తాడు. లుబ్ధావ ధాని తన కూతురుని మాని ఇంకొక పిల్లను పెళ్ళాడితే అతని ఇంటికెళ్ళి పోట్లాడి, అతనిని కొట్టి పైపెచ్చు అతనిపై దావా చేసినాడు. సొమ్ముపట్ల ఎవరినీ నమ్మడు, రామప్ప మాత్రము మసిబూసి మారేడు చేసి ఇతని కడియాలు అపహరించగలిగినాడు. నోటు వ్రాయడమితని కిష్టములేదు. కేసుపోతే ప్లీడరుకి ఫీజు ఇవ్వడు. వెర్రి కోపముచేత ఒకానొకప్పుడు నష్టపోవును. శిష్టాచార సంపన్నుడైనా సమయము వచ్చినప్పుడు సానివాడకు వెళ్ళినాడు. బుచ్చమ్మ లేచిపోయిందని విని చింతించుటకు మారుగా కోపబడి తిట్టినాడు. గిరీశం చెప్పినట్లు ఇతనికి హితోపదేశం చెయ్యడము వ్యర్థము. తాను వినకపోవడమే కాకుండా చెప్పే వాళ్లని చెడతిట్టును. శుల్కము పుచ్చుకోకూడదని గిరీశమంటే పెరుగన్నము బుచ్చమ్మ నెత్తిని పులిమినాడు. సౌజన్యారావు సంఘసంస్కరణము మంచిదని బోధిస్తే అతన్ని తిట్టినాడు.... అదంతా మీకెందుకయ్యా? ఓహో! మీ గృహకృత్యాల ఊసుకి నేనొచ్చానా ఏమిటి?

నా గృహకృత్యాల వూసు మీకెందుకు?....వెధవముండని లేవదీసుకుపోయిన ఫకీరు వెధవ పక్షం మాట్లాడతావు, ఏమి పెద్దమనిషివయ్యా? వెధవముండలికి పెళ్ళిచేయడము పోయేకాలం పట్టుకుందేమి పెద్దవాళ్ళకి కూడానూ?... ....'' గిరీశంమీద చేసిన దావా తీసివేసి బుచ్చమ్మ ఆస్తి ఆమె పరం చేయవలసినది. లేకుంటే చాలా బాధ కలుగుతుంది. ఆ రెండు కేసులలో నేనే పని చేస్తాను. మీకు శరీరక్లేశము, అర్థనష్టము కలుగుతవి'' అని రావుగారు సలహాయిస్తే ''నేను అగ్రహారపు చెయ్యిని, దావా అని బెదిరిస్తే భయపడేవాడను కాను'' అని ప్రగల్భములాడినాడే కాని వూరూ పేరూ తెలియని ప్రతివాదిపైని దావా తెచ్చినాడు. బుచ్చమ్మ పుట్టిన సంవత్సరము ''భావ'' అని జాతకములోనుంటే తాను ''అంగీరస'' అని ప్రమాణము చేసి చెప్పినాడు. రెండేళ్ళపైని బడితే మైనార్టీ తీరిందని వాదించే ఆశ మాత్రమే చూచుకొన్నాడుగాని అసత్యానికి వెరవలేదు. చేయదలుచుకొన్న కార్యము చేసివేయడమే కాని ముందు వెనకలాలోచించడు. నాయుడిమీద అనుమానపడి వకాల్తీ భీమారావుగారి కిమ్మని రామప్ప చెప్పినందువల్ల మార్చినాడు. నాయుడు ఫీజడిగితే నీవు వ్రాసిన Defence బాగుంది కాదని ధిక్కరించి నాడు. ఇందువల్ల సొమ్మెగవేయకలిగినాడు కాని తీరరాని ముప్పు మూడింది. నాయుడు అగ్నిహోత్రు నిపై పగబట్టి అతనిపైన కొండెములు కల్పించి కలెక్టరుగారికి కోపము తెప్పించి కేసు పాడుచేయించినాడు.

అవధానిగారి తెలివిలేమికి ఒక్క విషయం చాలును; ఇతనితో సంబంధమున్న వాళ్ళందరూ ఇతని కంట్లో దుమ్ము కొట్టినారు. కొడుకు గొప్ప ఉద్యోగాలు చేస్తాడని ఇతడు ఆశిస్తుంటే వాడు దుర్వినియోగము చేస్తున్నాడు. కరటక శాస్త్రి లుబ్ధావధానికి మాయపెళ్ళి చేసి ఇతని కూట్లో దుమ్ము కొట్టినాడు. ఇతనిచేత తగినరీతిని సత్కరింపబడి బడాయికొట్టి గిరీశం బుచ్చమ్మను లేవదీసినాడు. ఇతని కూతుర్ని పెళ్ళాడతానని నమ్మించి లుబ్ధావధాని ఇంకొకర్తెను వివాహమాడినాడు. ఇందువల్ల అవధానిగారికి ధనవ్యయము, గౌరవహానిన్నీ కలిగినవి. ఇతనిని కోతివలెనాడించి, వూళ్ళవెంటతిప్పి, డబ్బు ఖర్చు పెట్టించి అందరిచేత అవమానపరిపించి, తాతలనాటి తాకట్టుపెట్టి తాను హరించి చెప్పకుండా తన వూరికి చల్లగా జారినాడు. ఇతను కేసులో నియోగించిన ఇద్దరు ప్లీడర్లూ తగవులాడి కేసు దగ్ధపటల మొనర్చినారు. సౌజన్యారావుగారు హితోపదేశముచేసి తలతిక్క మనిషి అని విసిగి బుచ్చమ్మ ఆస్తికి దావా తెచ్చినారు. కలక్టరు తలవాచినట్లు చీవాట్లు పెట్టినాడు. భార్య ఇతనితో ఏకీభవించక ఇంట్లో పోరు పెట్టింది. కూతురు బుచ్చమ్మ ఇతని కృత్యముల నేవగించి, ఇంటినుండి లేచిపోయి హాయిగా పునర్వివాహము చేసుకొంది. ముక్కుమొగ మెరుగని మధురవాణి కూడా ఇతనితో స్పర్థించి ప్రతిగా వ్యవహరించి నాటక మాడించింది. ఈతీరున ఇంట్లో వాళ్ళూ, పైవాళ్ళూ ఇతనిమీద కత్తి కట్టినారు. దీని కంతటికీ మూలము అవధానిగారికి కన్యాశుల్కమందున్న గట్టిపట్టు. అందరూ వద్దన్న పనిని చేయవలెననే హఠమే అగ్నిహోత్రుని కొంప గుల్లచేసింది. తలపెట్టిన పని తారుమారు చెయ్యనా అనే అహంభావ మింతమట్టుకు తెచ్చింది. పట్టుదల మానవునకు మంచి లక్షణమేకాని అది దుష్టప్రవృత్త్యావేశముచేత పుట్టినట్టయినా కీడు తప్పదు. తానొకటి తలుస్తే దైవమన్యథా తలుచునన్న న్యాయ మీతని యెడల సార్థకమయినది. చెడ్డపని చేయదలచినవాళ్ళకు చేటు తప్పదు. తమకు దోచినదే తథ్యమనిన్నీ, పరోపదేశము పాటిచేయరాదని తలచే మహాత్ములు అనేకులున్నారు. వీరి దుస్సర్వజ్ఞత్వము, దురపనేయము, సర్వానర్థకారి. ఐనా వీరీపట్టు విడువరు. అహమిక అంతటినీ పాడుచేస్తుంది. మానవుడు సర్వజ్ఞుడు కాడు. అందుచేతనే ''వినదగు నెవ్వరు చెప్పిన.....'' అని చెప్పినాడు వేమనయోగి. అవి మృశ్యకారికి ఆపదలు మెండు. ఎట్టి ధీమంతునకైనా ప్రమాదము సంభవించవచ్చును. అందు హితబోధ అవశ్యకము. ''బాలాదపి గృహీతవ్యం యుక్తాయుక్తం మనీషిభిః'' అనే మహా వాక్యము మరువగూడదు.

# సాహిత్యము: వ్యక్తి వికాసము

(గత సంచిక తరువాయి) - ఆర్.ఎస్. సుదర్శనం

స్థూలదృష్టికి విశ్వనాథ తన రచనలద్వారా వ్యక్తి వికాసం పూర్వసంస్కృతిమీద, సంప్రదాయం మీద ఆధారపడిందన్న విశ్వాసంతో వాటి పునరుద్ధరణకు కంకణం కట్టుకున్నట్లు తోస్తుంది. అలాగే శ్రీశ్రీ మార్క్సదర్శనం, కమ్యూనిస్ట్ వ్యవస్థ వ్యక్తివికాసానికి గట్టి భూమిక అని విశ్వసించినట్లు తోస్తుంది. నిశితంగా వారి రచనల్ని పరిశీలిస్తే ఈ రెండూ నిజం కావని తెలుస్తుంది. వ్యక్తిస్వాతంత్ర్యాన్ని లక్ష్యంగా పెట్టుకున్న చలం నవల 'మైదానం' లోని రాజేశ్వరి కంటె, విశ్వనాథ 'చెలియలికట్ట'లోని రత్నావళి సాధించిన స్వాతంత్ర్యం, వ్యక్తి వికాసం విశ్వసనీయంగా ఉంటాయి. విశ్వనాథ బృహన్నవల 'వేయిపడగలు'లో విస్తృతంగా భారతీయ సంస్కృతి, తెలుగువారి జీవితం చిత్రింపబడినప్పటికీ, అందులో వ్యక్తి వికాసం మృగ్యమే. కారణం వ్యక్తి తాలూకు సంఘర్షణ లేకపోవడం. విశ్వనాథ 'తెరచిరాజు' నవలలో వ్యవస్థకు అతీతుడైన సారథి వ్యక్తిత్వాన్నీ, అతని స్వధర్మాన్నీ (రసమార్గం) నిరూపించే ప్రయత్నం చేశాడు. సారథిలోని సంఘర్షణ దాని పరిష్కారం విశ్వసనీయంగా లేకపోవడంవల్ల సారథి వ్యక్తిత్వం సాధించిన స్వాతంత్ర్యంగాని, వికాసం గాని ఏమీ లేకపోయింది.

ఉన్నవవారి 'మాలపల్లి'లో సామాజిక చిత్రణ ఒకవైపూ, సంగదాసు, రామదాసుల వ్యక్తి వైశిష్ట్యమూ, వారు సాధించిన వ్యక్తివికాసమూ నిరూపించడం మరోవైపూ, ఆ నవలని తెలుగులో అత్యుత్తమ నవలగా నిలబెడుతున్నవి.

గోపీచంద్ నవలలు - 'అసమర్థుని జీవయాత్ర' మొదలుకొని 'శిథిలాలయం', 'యమపాశం' వరకూ వ్యక్తి అన్వేషణకూ, వికాసానికీ ప్రాధాన్యం యిస్తూ వ్యక్తి స్వధర్మం తాలూకు తీరుతెన్నులను ఆవిష్కరించినవే. జీవితంపట్ల ఆసక్తీ, ఉత్సాహమూ ఏర్పడాలంటే వ్యవస్థనూ, పరిస్థితులనూదాటి చూచేచూపు, చొరవ ముఖ్యం అంటూ గోపీచంద్ 'యమపాశం'లో మధ్యతరగతి సామాన్యుని చేత పలికించిన మాటలు ''నేటి మన నైతిక విలువలు వట్టి నిషేధాజ్ఞలే. నిషేధ బుద్ధితో జీవితాన్ని చూచిన ఏ వ్యక్తీ వికసించడు. వికసించని ఏ వ్యక్తికీ విముక్తిలేదు. జీవితాన్ని బహుభంగుల అనుభవించిన వ్యక్తే సంపూర్ణతను పొందగలుగుతాడు. పరిస్థితుల ప్రభావం అంటున్నారు గాని.... మానవుడు పెరిగినకొద్దీ పరిస్థితుల ప్రభావం క్షీణిస్తుంది. మన సంకల్పంలో ఏదో లోపం ఉంది. చీటికీ మాటికీ పరిస్థితుల్ని సాకుగా, డాలుగా వాడుకుంటున్నామేమో ననిపిస్తుంది నాకు... మనకంటె బీదవాళ్లూ, దురదృష్టవంతులు ఎంతమందిలేరు? వాళ్లకు లేని వేదన మనకు ఎందుకు ఉండాలి? ఎవరి బ్రతుకు వారిది. ఒకరితో పోల్చుకుని వ్యథపడటం ఎందుకు? మనం చూడగలగాలే కాని ఏ నడకలో ఉన్న మాధుర్యం ఆ నడకలో ఉంది. అడుగు తప్పకుండా పడితేసరి.'' ఆ 'అడుగు తప్పకుండా పడట'మే స్వధర్మాన్ని పాలించడం. ''శ్రేయాన్ స్వధర్మోవిగుణః పరధర్మాత్ స్వనుష్ఠితాత్''. "To follow one's impulse is slavery, but to obey the self-prescribed law is liberty" అన్నాడు రూసో.

రాచకొండ విశ్వనాథ శాస్త్రి నవల 'అల్పజీవి'లో జీవితమంటే, మనుషులంటే భయపడే సుబ్బయ్య ప్రధాన పాత్ర. ఆ భయం నుంచీ అతను విముక్తుడు కావడం - అది మానసికమైన అవరోధాన్ని అధిగమించడంగా చిత్రింపబడింది. సుబ్బయ్యతోబాటు వెంకట్రావు, కామేశం పాత్రల్లోకూడా అటువంటి ఎదుగుదల, వ్యక్తి వికాసమే చూపించాడు రచయిత. ఈ వ్యక్తి వికాసానికి సమాజం విధించే 'నిషేధాజ్ఞల' తో సంబంధం లేకపోవడం గమనించదగిన విషయం.

మార్క్సిజమ్‌ని తన దృక్పథంగా స్వీకరించి, విమర్శనాత్మక వాస్తవికత పేర నవలలూ కథలూ వ్రాసిన కొడవటి గంటికుటుంబరావు రచనల్లో వ్యక్తివిశిష్టతకుగాని, వ్యక్తిస్వాతంత్ర్యానికిగాని, వ్యక్తి వ్యవస్థతో సలిపే పోరాటానికిగాని ఆయుస్థానం కల్పించలేదు! ఇది ఆయన తెలిసి చేసిందే! 'సవతి తల్లి' అనే నవలలోచదువుకున్న రాజ్యం, చదువురాని ఆడవాళ్ల అపోహలకూ అలవాట్లకూ ప్రతినిధులైన తన అత్తా ఆడబడుచుల అజ్ఞాన విషవలయం నుంచీ సవతి పిల్లల్ని రక్షిస్తుంది. ఆమె సలిపేపోరాటం, ఆమె శక్తియుక్తులూ, తెలివి తేటలూ ఆమె ఒక విశిష్టవ్యక్తి అనే అభిప్రాయాన్ని కలిగిస్తాయి. కాని ఆమె విశిష్టవ్యక్తి కాదు. అది ఆమె ఘనత కాదు. చదువుద్వారా సమాజంలో వస్తున్న మార్పుని సూచించే పరిణామమేనని కుటుంబరావు పనిగట్టుకుని వివరించాడు 'పాత్రలతో ముఖాముఖీ' అనే ఒక రచనలో 'అనుభవం' నవలలో వ్యక్తిత్వం, వ్యక్తి ప్రత్యేకత అనేది మిథ్య అని వివరణ యిచ్చాడు. ఒక మనిషిని తీసుకోండి, వాడిలో వ్యక్తిత్వం ఎక్కడున్నది? వాడి శరీరంలో ఎన్ని ధాతువులు? ఎన్నికోట్ల జీవకణాలు! తమపని తాము చేసుకుంటూపోయే గుండెకాయ, ఊపిరి తిత్తులు, గ్రంథులు, రక్తప్రవాహం, మెదడు, నరాలు! వాటి జీవితాలు వాటికున్నాయ్. శరీరం ఓ పెద్ద ప్రపంచం. అందులో ఎన్నో జీవరాసులు. వాటివాటి ప్రత్యేక జీవితాలు! కొన్ని కొద్ది క్షణాలు మాత్రమే బ్రతుకుతాయి. కొన్ని ఈ ప్రపంచం ఉన్నంతకాలమూ ఉంటాయి... మనలోపల ఉన్న ఈ సమిష్టిత్వం మనకు చాలటం లేదు! బయటినుంచీ సమిష్టిత్వాన్ని వెదుక్కుంటున్నాము. పదిమందిచేరి తమ వ్యక్తిత్వాలను కలగలుపుకున్నప్పుడే మనకు ఆనందమూ, ప్రయోజనమూ ఉంటున్నది. వ్యక్తిత్వాన్ని సమిష్టిలో లీనం చెయ్యటానికి నా చిన్న తనంలో భజనలు చేసేవాళ్లు, పురాణాలు వినే వాళ్లు... తరువాత ఉద్యమాలు వచ్చాయి. ఈనాడు సినిమాలూ అవీ అందుకే ఉపయోగపడుతున్నాయి. కళలకున్న ప్రయోజనంకూడా అదే! (కుటుంబరావు సాహిత్యం, సంపుటి 1, 168 పేజీ). వ్యక్తి ఒక శకలమే తప్ప పూర్ణుడుకాదనీ, వ్యక్తిగా అతను సాధించే వికాసం ఏదీ లేదనీ కుటుంబరావు నిశ్చితాభిప్రాయం. సామాజిక ధోరణుల్ని ఎంతగా విశ్లేషించినా, మనిషిని మనిషిగా చూడలేకపోవడం కుటుంబరావు రచనల్లో లోపం. దీన్ని శ్రీశ్రీ గుర్తించాడు — ''కుటుంబరావు తన మెదడుని ఎంత జాగ్రత్తగా చక్కదిద్దుకున్నాడో అంత అశ్రద్ధగా తన హృదయాన్ని నిర్లక్ష్యం చేశాడు... కుటుంబరావు కథలు చదవండి. తన గుండెల్ని బాదుకుని, ఎదురు గుండెల్ని బద్దలుచేసే టెక్నిక్ అందులో మీకు దొరకదు. ప్రతి కథా మీ మెదడుకి మేత పెడుతుంది. మీచేత ఆలోచించేట్లు చేస్తుంది. ఆలోచన ఆచరణకి ఆరంభం'' (297వ పేజీ - శ్రీశ్రీ వ్యాసాలు).

''పదిమందీ చేరి తమ వ్యక్తిత్వాలను కలగలుపుకున్నప్పుడే మనకు ఆనందమూ, ప్రయోజనమూ'' అనే కుటుంబరావు అవగాహనలో లోపం కనిపిస్తుంది. వ్యక్తి సామాజికుడు, అతనికి యితరులతో సంబంధాలు ఉన్నాయి. నిజమేకాని ఒక వ్యక్తి మరొకవ్యకితో గాని, సామాజిక

సమిష్టి చైతన్యంతోగాని ఏకం కావడం భౌతికంగా, మానసికంగా సాధ్యమా? ఆధ్యాత్మికంగా లేక అతీతమానస చైతన్యం స్థాయిలో అటువంటి ఏకత్వం సాధ్యమేమో కాని అది ప్రస్తుతాంశం కాదు! అందుకే బుచ్చిబాబు అంటాడు "ఏ ఒక్కరి పరిస్థితులూ, బుద్ధి వికాసాలూ మరొకరికి రావు. అయినా వాళ్ళందర్నీ ఒక ఫక్కీలో నడుచుకోమనడమే మన దౌర్భాగ్యం. ఎవరి జీవితాన్ని వారు చక్కబెట్టుకుంటే ప్రపంచం బాగుపడుతుంది." సంఘాన్ని మార్చలేడు. మనుష్యుల్ని మార్చలేడు. మారిస్తే బాధ, పగ, యుద్ధం. తనతో తను సమాధానపడాలి. అది సాధించాడు. ఒక ప్రశాంతత, పవిత్రమైన మహత్తర ఆనందం... అది బాహ్యప్రపంచంలో లేదు. పిచ్చి ప్రపంచాన్ని దయతో దూరంగా ఉంచే ఔదార్యం, మతాన్ని, దైవాన్ని, మనుషుల్ని తోసేసి సంతృప్తిచెందే ఆధ్యాత్మికదృష్టి, తనలో కడసారి యథార్థం". బుచ్చిబాబు సృష్టించిన దయానిధి అన్వేషణ, అతని వ్యక్తివికాసం, అతని విముక్తి కుటుంబరావు దృష్టిలో భ్రమలు మాత్రమే. మనిషి ఆంతర్యం అంటే, జీవకణాలు, ఊపిరితిత్తులు, గ్రంథులు అని నిర్వచించుకుని సామాజిక స్పృహతో రచనలు చేసిన కుటుంబరావుకి - హృదయంతో తెలుసుకోవడం, అనుభూతి పరంగా స్పందించడం, మానసిక స్వాతంత్ర్యాన్ని పొందడం వంటివి అర్థంలేని విషయాలు! "అందానికీ, ప్రేమకూ దమ్మిడీ విలువ లేదని నేనెరుగుదును" అని ఒక పాత్రచేత పలికించిన అభిప్రాయం అది కుటుంబరావు సొంత అభిప్రాయమే!

వ్యక్తి వికాసంలో, వ్యక్తికీ - వ్యవస్థకూ గల సంబంధం, సంఘర్షణ, సమన్వయం రూపొందడంలో కొన్ని విషయాలు గమనించక తప్పదు. చలం చిత్రించిన స్త్రీ పాత్రలకూ, గోపీచంద్ చిత్రించిన స్త్రీ పాత్రలకూగల తేడా గుర్తిస్తే, చలం పాత్రలు మరణంతో అంతమొందుతవి; గోపీచంద్ పాత్రలకు ఆగతి పట్టదు! వ్యవస్థ ఒకస్థాయి వ్యక్తులకు ఆలంబనముగా, పట్టు గొమ్మగా పనికివస్తుంది (చలం నవల 'వివాహం' లో కథానాయిక రవణ ఉదాహరణ); మరొక స్థాయివారికి అది ప్రతిబంధకంగా గోచరిస్తుంది. అంతకంటె పైస్థాయి వారికి అది ఉన్నా ఒకటే, లేకపోయినా ఒకటే, దానితో తామరాకుమీద నీటిబొట్టులాగా వ్యవహరించగల స్థాయి వారిది (ఉషారాణి – గోపీచంద్). ఇందులో ఎవరు ఏ స్థాయికి చెందినవారో నిర్ణయించగల హక్కు, బాధ్యత, ఏ వ్యక్తి విషయంలో ఆవ్యక్తి అంతరంగానిది మాత్రమే. ఆ అంతరంగాన్ని సాహిత్యం ప్రతిబింబించిన తరుణంలో ఆవ్యక్తి అనుభూతినీ, విశిష్టతనూ గ్రహించి తద్వారా లోకాన్ని కొత్త దృష్టితో దర్శించే అనుభూతి పాఠకులది. అది సమాజంలో వ్యక్తి స్వాతంత్ర్యానికీ, వికాసానికీ దోహదం చేస్తుంది.

నాగరకత, సంస్కృతి, వ్యక్తి సంస్కారము - ఈ మూడింటికీగల పరస్పర సంబంధం ఎలా రూపొందుతున్నదో, ఆ పరిణామంమీదే మానవజాతి మనుగడ, వికాసం, భవిష్యత్తు ఆధారపడ్డాయి. దీన్ని అత్యవసర సమస్యగా గుర్తించిన రష్యన్ మేధావుల సదస్సు 1988లో బ్రైటన్‌లో 17th World Congress of Philosophy లో 'The Philosophical Conception of Man' శీర్షిక క్రింద చర్చించింది. అందులోని 22 ప్రసంగ వ్యాసాలు సంపుటిగా ముద్రితమయ్యాయి. Progress Publishers, Moscow ప్రచురించారు. అందులో వెలువరించిన అభిప్రాయాలు కొన్ని –

"...it is impossible to wait indifferently until the objective course of history itself overcomes all the complexities and controdictions of modern life and creates a firm basis for universal peace and prosperity. And there is no objective

course of history that would operate of itself, independent of us, in favour of progress. It is quite natural too that man turns first of all to himself in this critical situation, to strictly human forces and possibilities" (Page 217).

("చరిత్రగతి వస్తుపరిణామంగా దానికదే ఆధునిక జీవన సంక్లిష్టతలనూ, వైరుధ్యాలనూ అధిగమించి, ప్రపంచశాంతికి, అభ్యుదయానికీ భూమిక నిర్మిస్తుంది లెమ్మంటూ ఆ సుముహూర్తం దాకా వేచి ఉండటం సాధ్యం కానిపని. దానికదే అలా వర్తించే చరిత్రగతి - మనల్ని అంటే మనుష్యుల్ని మినహాయించి - స్వచ్ఛందంగా అభ్యుదయం దిశలో పయనించేది అంటూ ఏదీలేదు. ఈ సంక్షోభ స్థితిలో మనిషి మనిషివైపే దృష్టి సారించడం సహజం. అంటే కేవలం మానవ శక్తియుక్తులమీద, సాధ్యాసాధ్యాల మీదా దృష్టి నిలపడం కర్తవ్యం.")

"Marx distinguished society, culture, and above all the material conditions of the reproduction of human life; Nietzsche biological cosmic–irrational life forces and impulses, and Freud the biopsychological sphere of unconscious inclinations and instincts..."(Page 218)

("మార్క్స్ సమాజమూ, సంస్కృతి, మానవ జీవితం ఆధారపడే భౌతిక పరిస్థితులను ముఖ్యంగా, వివేచించారు. నీట్షే ప్రాణ సంబంధియై, విశ్వమూలకాలై హేతు వివేచన కందని శక్తులనూ, ప్రేరణలనూ పేర్కొన్నాడు. ఫ్రాయిడ్ మానసికరంగంలో అచేతనలో నుంచి వచ్చే వాంఛలనూ, ప్రేరణలనూ అధ్యయనం చేశాడు.")

"True humanism cannot and must not make an apriori judgment of man's value by one or other of his separate qualities, breaking him down into immutable opposing essences (exalted spirit and base body, free will and calculating reason, insightful mind and blind emotion). In the place of such an anthropological dualism of mind and body, **there stands an integral human essence, a single human personality**, which does not manifest itself as good or bad, free or unfree, base or exalted, in its separate properties but rather in its personal behaviour and actions, choice and decisions. The humanism of the spirit and nature is indissoluble today" (Page 220)

("నిజమైన మానవతావాదం మనిషి విలువని యిదమిత్థమని మొదటే నిర్ధారించుకోగూడదు. మనిషిలోని భిన్న లక్షణాలను బట్టి నిర్దిష్టమైన - పరస్పర విరుద్ధమైన - తత్త్వాలుగా మనిషిని విభజించి (ఉదాత్తమైన ఆత్మ - నికృష్టమైన శరీరం; స్వచ్ఛందమైన సంకల్పం - లక్ష్య నిర్దేశం చేసే హేతుత్వం; అనుశీలన చేసే మనస్సు - ముప్పిరిగొనే ఆవేశం) వానిలో ఏదో ఒక దాన్ని పట్టుకొని మనిషి విలువని నిర్ణయించడం కుదరదు. మనస్సు - శరీరం వంటి ద్వంద్వాలను విసర్జించి చూస్తే మనిషి పూర్ణుడు, అతనిది విశిష్టమైన వ్యక్తిత్వం అనే తత్త్వం నిలుస్తుంది. దాని అభివ్యక్తిని మంచీ - చెడూ, స్వతంత్రతా - పరతంత్రతా, నీచము - ఉచ్చము అంటూ ద్వంద్వ లక్షణాలుగా కాక, అతని ప్రవర్తనలో, సంకల్పాల్లో, నిర్ణయాల్లో దర్శించాలి. నేటి మానవతావాదంలో ఆత్మ - ప్రకృతి విడదీయరానివిగా కలసి పోయాయి.")

"The contemporary philosophy of man is a philosophy of his creatively active

and socially responsible life, of **the determining role of the subjective factor in the solution of vitally important problems of both the individual and the entire mankind..."** (Page 222)

(''మానవుని గూర్చిన ఈనాటి తత్త్వవివేచనకు లక్ష్యం మానవుని సృజనాత్మకత, సామాజిక బాధ్యత మేళవించిన జీవితం, అందులో వ్యక్తి అంతరంగం వహించే నిర్ణాయక పాత్ర, అది ఎలా వ్యక్తిగత సమస్యల్ని, మానవాళి సామూహిక సమస్యల్ని ఎదుర్కొని పరిష్కారం సాధించగలదు, అనేవి ప్రాధాన్యం వహిస్తాయి.)

"The moulding and education of a cultured person is a lengthy and complicated process, which forms an important element of the many faceted process of a person's socialisation that should lead both to his adequate social self–fulfilment and profound inner self–improvement. The road to this goal lies **within a person, and not outside him.**" (Page 253)

(''వ్యక్తి సంస్కారాన్ని రూపొందించేందుకు తగిన శిక్షణా, విద్యాభ్యాసమూ సుదీర్ఘమూ, సంక్లిష్టమూ అయిన విషయాలు. బహుముఖాలుగా వ్యక్తిని సామాజికుణ్ణి చేసే విధానంలో అవి ముఖ్యభాగం. దాని లక్ష్యం అతని వ్యక్తిత్వం సామాజికంగా తగురీతిలో ఫలప్రదం కావడం, అంతరంగికంగా పూర్ణ వికాసం పొందడం. దానికి వ్యక్తి ఆంతర్యంలో తప్ప, బాహ్యలోకంలో మార్గం లేదు.)

మనిషిని సిద్ధాంతాల రీత్యా పాక్షికంగా నిర్వచించడం, లేక శరీరం మనస్సు, ఆత్మ అంటూ విశ్లేషించడం ఈనాటి తాత్త్విక దృష్టి కాదు! అతణ్ణి వ్యక్తిగా, పూర్ణతత్త్వంగా సంభావించి, ఆ వ్యక్తి వికాసాన్ని అతని ప్రవర్తన, చేతలు, ఉద్దేశాల ద్వారా అధ్యయనం చేయవలసివుంది. ఇందులో ప్రధానమైన అంశం అతని అంతరంగం; అది వ్యక్తిగత సమస్యల్ని, మానవాళి సమస్యల్ని ఎలా ఎదుర్కొంటున్నది అనే విషయం. వ్యక్తి సంస్కారం ఒక నాటిలో సిద్ధించేది కాదు. వ్యక్తి వ్యక్తిగా పరితృప్తి చెందుతూ, సామాజికుడుగా అనురక్తుడు కావాలంటే దానికి మార్గం అతని అంతరంగంలోనే వుంది గాని బయట కాదు.

సంఘం చేసినవాడే మనిషి, వ్యక్తిత్వం మిథ్య, వ్యవస్థమారితే గాని మనిషి మారడు అనే అవగాహన బదులు, వ్యక్తి పూర్ణుడు (integral essence), వ్యక్తిగా అతని అంతరంగంలో నుంచే మార్పురావాలి; దానికి ఆత్మశోధన, ఆత్మ శిక్షణ ప్రధానం; వ్యక్తి సంస్కారం నుంచే మానవాభ్యుదయం గాని, నాగరకత ఉత్పన్నం చేసే సమస్యల పరిష్కారం గాని సాధ్యమని నేటి రష్యన్ మేధావుల అవగాహన.

ఇది సరియైన అవగాహన. వ్యక్తి ప్రత్యేకతను, విశిష్టతను గుర్తించి అతనిలోని అన్వేషణను చిత్రించగలిగిన సౌలభ్యం సాహిత్యానికే వుంది. తత్త్వశాస్త్రం సాహిత్యం ద్వారా మనిషిని అధ్యయనం చెయ్యడం ఒక్కటే మార్గం: అప్పుడు తత్త్వశాస్త్రమూ సాహిత్యమూ ఒకటే అవుతవి!

(సమాప్తం)

The IMF and the Bank do not bother about the social, cultural and economic impact of their policy conditionality.

(గత సంచిక తరువాయి)

# శాస్త్ర-కళా దర్శనం - 2

- ఎన్. వి. బ్రహ్మం

హేతుదృష్టి, సత్యదృష్టి జీవపరిణామ క్రమంలో మనిషి అవతరించినాక నిన్న మొన్నట్లో కన్ను తెరిచాయి. దిగువ స్థాయి జీవజాతుల్లో ఇవి కలికానికి కూడ కనపడవు. కాని నీతీ-విలువలూ, శివమూ-సుందరమూ అ జీవజాతుల్లో అనేక సందర్భాల్లో దర్శన మిస్తాయి. తోటిపక్షి చస్తే ఆహారం విసర్జించి ప్రాణం వదిలే పక్షి ప్రదర్శించే కఠోరదీక్షకు గీటురాయి యేది? అందమైన పూలచేత ఆకర్షింపబడే తుమ్మెద సహజాత సౌందర్య దృష్టికి గీటురాయి యేది? శివానికీ సుందరానికీ సత్యమే గీటురాయి కావలసి వస్తే 'హేతుబద్ధ' నిర్ణయం ప్రకృతి విరుద్ధంగా పరిణమించిందన్న మాటే. దానితో కాని మానవత్వానికి మరణ శాసనం లిఖింప బడదు! అంతకన్నా అదనపు వివరణ ప్రస్తుతానికి అనవసరం.

కార్యకారణ సంబంధపరంగా ప్రధానకారణం వస్తుగతమని రాడికల్ హ్యూమనిస్టు తత్వం నొక్కి వక్కాణిస్తుంది. మతం బాహ్యకారణం; మనస్తత్వం అంతః కారణం. మనస్తత్వం మారితే మతం చస్తుందంటే అప్పుడు వస్తుగత కారణానికి విలువ ఇచ్చి నట్లవుతుంది. కాని 'ఆ మతం పూర్తిగా చస్తే తప్ప ఆ క్రూర మనస్తత్వం చావదు' అనేవారికి అంతర్గత కారణ సూత్రం ఒంటపట్ట లేదనుకోక తప్పదు. అలాంటివారికి హేతుదృష్టి, సత్యదృష్టి లోపించా యని వేరే చెప్పవలసిన పనిలేదు.

ఆనాటికైనా యీనాటికైనా ప్రకృతిని అద్భుత ప్రక్రియగా పరిగణించే తరహా మతదృష్టికల మహనీయులున్నారు. ఆల్బర్ట్ ఐన్‌స్టైన్ అందుకుదాహరణ. ఈ అద్భుత ప్రక్రియనే ఆయన మార్మికత అన్నాడు. ఆయన అంతరంగాన్ని ఆయన మాటల్లోనే అర్థం చేసు కుందాం: 'మనం అనుభవించగల వాటిలో అత్యంత సుందర వస్తువు మార్మికతే. అసలైన కళలకూ శాస్త్రాలకూ అన్నిటికి మూల మదే. ఎవడు ఈ ఉద్వేగానికి దూరస్థుడో, ఎవడు కాస్త ఆగి విస్మయచిత్తుడు కాడో, ఎవడు కొంచెం నిలిచి సంభ్రమంతో హర్షోన్మత్తుడు కాలేడో అతడు కేవలం మృత ప్రాయుడు, అంధుడు....మన అవగాహన కందనిది నిజంగా వుందనీ, అదే అన్నిటికన్నా ఉన్నతమైన జ్ఞానంగా, అన్నిటికన్నా దేదీప్యమానమైన సౌందర్యంగా వ్యక్తమవుతూ వుంటుందనీ, ఆ జ్ఞాన సౌందర్యాలలో అత్యంత ఆదిమ రూపాలను మాత్రమే మందస్వభావం కల మన మనశ్శక్తులు అవగాహన చేసుకో గలవనీ గ్రహించాలి. ఈ జ్ఞానమే, ఈ భావనే నిజమైన మతభావానికి కేంద్రంలో వుంటుంది. ఈ అర్థంలో, ఈ అర్థంలో మాత్రమే, నేను మత తత్పరుల కోవకు చెందుతాను.' (The most beautiful thing we can experience is the mysterious. It is the source of all true art and science. He to whom this emotion is a stranger, who can no longer pause to wonder and stand rapt in awe, is as good as dead: his eyes are closed....To know that

what is impenetrable to us really exists, manifesting itself as the highest wisdom and the most radiant beauty which our dull faculties can comprehend only in their most primitive forms-this knowledge, this feeling, is at the center of true religiousness. In this sense, and in this sense only. I belong in the ranks of devoutly religious men).

ఐన్‌స్టీన్ దృష్టిలో ప్రకృతిలోని మార్మికతే (అద్భుత ప్రక్రియే) అత్యంత సుందర వస్తువు. అదే అసలైన కళా శాస్త్రాలకు మూలం. అదే తన మత తత్పరత కాధారం. అలా ఆయన కళాతత్వ – శాస్త్రతత్వ – మతతత్వాలకు మూలాధారం ప్రకృతే అయింది. శాస్త్ర శోధనలో ఎంతగా మునిగి పోయే వాడో అంతగా పియానో చేతపట్టి కళాస్వాదనలో కరిగి పోయేవాడు. అంతగానే ప్రకృతిలోని మార్మికతకు ఫలితమైన మతతత్పరతలో తన్మయుడయ్యే వాడు. ఈ మూడు తత్వాలూ ఆయనలో సహజీవనం చేశాయి. ఈ తత్వాల నవగాహన చేసుకోని వాళ్ళే వాటిని విడివిడిగా శత్రు శిబిరాలలో బంధిస్తారు. మార్మికత కళదే అయినట్లూ శాస్త్రానిది కానట్లూ, అందులో వాస్తవికత లేనట్లూ రాస్తారు.

హేతువాది ఎప్పుడూ తానే హేతువాది ననీ, ఇతరులకు హేతువాదం తెలియదనీ భావించడు. హేతువాదం ఒక్కొక్క మనిషిలో ఒక్కొక్క స్థాయిలో పని చేస్తుంటుంది. పారంపర్యంగా వచ్చే వారసత్వం, చుట్టుముట్టి వుండే పరిసరం, పుట్టుకతో వచ్చే వ్యక్తిత్వం ఏ ఇద్దరికి ఒకటి కావు. కనుక వాటి ప్రభావాల ఫలితంగా ఏ ఇద్దరి ఆలోచనా ధార ఒకటిగా వుండదు. అంటే ఏ ఇద్దరి హేతువాదం మక్కికి మక్కిగా వుండదన్న మాట.

అలాగే శాస్త్రం, కళ, మతం, నీతి వగైరా అంశాలను బట్టి కూడ హేతువాదం మారుతుంది. కనుక శాస్త్రాన్ని కొలిచే హేతువాదంతో కళను కొలిచి తప్పుపట్టటం పక్కా నిర్హేతుక వాదం.

వినియోగవాదం లోని తాత్కాలిక ప్రయోజనాన్ని పరిహరిస్తే – వస్తుతః వినియోగ దృష్టిలో తప్పు లేదు. మానవుడేది చేసినా అది తన కోసమే, తన ప్రయోజనం కోసమే, చేసుకుంటాడు. అది శాస్త్రం కావచ్చు, కళ కావచ్చు. అయితే ఇవి మానవుని విభిన్న మానసిక ప్రతిభలకు ప్రతిరూపాలు. మానవ స్వభావాని కనుగుణంగా స్వచ్ఛందంగా పుట్టి పెరిగే ప్రతిదీ ప్రకృతి అంతర్యాన్ని ప్రతిబింబిస్తూ మానవుని స్వేచ్ఛాపిపాసను తృప్తిపరుస్తుంది. అందువల్ల 'కళ కళకోసమా? మరోదాని కోసమా?' అంటే - 'మానవుడు మానవుడి కోసమా? మరోదానికోసమా?' అని ప్రశ్నించుకోమంటాను. నా దృష్టిలో మానవుడు మానవుడి కోసమే. కనుక మానవ స్వభావ జన్యాలు, కళ కళ కోసమే; శాస్త్రం శాస్త్రం కోసమే. శాస్త్రం శాస్త్రం కోసమే అనటంలో జిజ్ఞాస యొక్కయూ, కళ కళ కోసమే అనటంలో రస పిపాస యొక్కయూ స్వతంత్ర ప్రతిపత్తులను గుర్తిస్తున్నా మన్నమాట. వివేక సంబంధియైన జిజ్ఞాస, ఉద్వేగ సంబంధియైన రసపిపాస–రెండూ మానవ స్వభావాలే. ప్రకృతి సిద్ధాలైన యీ స్వభావాలకు మన పరిమిత జ్ఞానంతో పరిధు లేర్పరచ కూడదు. అవి వ్యాప్తిచెంద వలసిన దిశలను మనం నిర్దేశించ కూడదు. వాటి కర్తవ్యాలను నియంత్రించ కూడదు. అలా పరిధులేర్పరచి, నిర్దేశించి, నియంత్రిస్తే మానవుడదృశ్యుడవుతాడు.

మానవుణ్ణి అదృశ్యం చేసేపని అటు సన్యాసులదీ, ఇటు నియంతలదీ. అందుకే సన్యాసులూ నియంతలూ మానవుని జిజ్ఞాసనూ రసపిపాసనూ పాతిపెట్టటానికే పూనుకొన్నారు. మానవ కేంద్ర భావనను మన్నించే మానవవాదం రసపిపాసనూ జిజ్ఞాసనూ రెండు కళ్ళుగా స్వీకరించాలి. కానిపక్షంలో అది కన్నుగానక సన్యాసం స్వీకరించ వచ్చు; లేదా నియంతృత్వం వహించ వచ్చు; దానితో మానవవాదంలో మానవుడు మరణించి, వాదం మాత్రమే మిగులుతుంది.

చరిత్రలో మతజ్ఞులూ శాస్త్రజ్ఞులూ ఘర్షణ పడిన సందర్భాలు కనిపిస్తాయి కాని, కళాకారులూ శాస్త్రజ్ఞులూ ఘర్షణపడ్డ సందర్భాలెక్కడా కానరావు. అందుకు కారణం కళాతత్వం, శాస్త్రతత్వం మానవ స్వభావంలో పరస్పరం పరిపూరకాలు కావటమే.

ప్రకృతి విన్యాసాలను అనుకరిస్తూ కల్పనాబలంతో నైపుణ్యంతో సృజన చేయటంలో మానవునిలో పరమోత్కృష్టంగా ప్రకటిత మయ్యే అంతర్గత జీవప్రవృత్తే కళ. అలాంటి సృజన చేయగల శక్తీ ఆ సృజనకు అనుభూతి పొందగల శక్తీ కలిసి కళాతత్వ మవుతుంది. శాస్త్రం మనస్సు యొక్క బాహ్య పరిధుల్లో చేతన స్థాయిలో రూపుదాలుస్తుంటే–అందుకు భిన్నంగా కళ మనస్సు లోతుల్లో నుంచి, అంతరంగంలో నుంచి, ఆవిర్భవిస్తుంది. అందు చేతనే శాస్త్రతత్వం కన్నా కళాతత్వం అత్యంత బలీయంగా వుంటుంది. శాస్త్రతత్వాన్ని కాదనటం వల్ల మానవుని ప్రత్యేకత నశించే మాట వాస్తవం; కళాతత్వాన్ని కాదనటం వల్ల మానవుడే నశిస్తాడన్నది కూడ యథార్థమని మనం గుర్తించాలి. ఎందు వల్ల? రెండూ మానవ స్వభావంలో మిళితమై వున్నందు వల్ల.

మానవ స్వభావాన్ని అవగాహన చేసుకోవా లంటే పసి పిల్లల్ని అధ్యయనం చేయక తప్పదు. అలా అధ్యయనం చేయబూనే వాళ్ళకు జిజ్ఞాసకే కాక రసపిపాసకు కూడ పునాదులు పిల్లల్లో స్పష్టంగా గోచరిస్తాయి. ఇంకా చెప్పవలసి వస్తే శిశువు అభివృద్ధిలో రసపిపాస ప్రారంభమైన తర్వాత కొంత కాలానికి కాని జిజ్ఞాస ఆరంభం కాదు. జిజ్ఞాసకు ఆధారాలు బాల్యంలో కనిపిస్తే రసపిపాసకు నిదర్శనాలు శైశవంలోనే వ్యక్తమవుతాయి. అందుకు కారణం జిజ్ఞాసకు నిలయమైన చేతన ఇటీవల మానవునితోనే ఆరంభమయింది. రస పిపాసకు నిలయమైన అధశ్చేతన జీవపరిణామంలో అతిపురాతనమైనది. మనకు కనిపించే జీవుల్లో రసపిపాస లేని జీవులు అరుదు. జిజ్ఞాస మనుషులకే పరిమిత మనవచ్చు. అందుకే జిజ్ఞాసకు రసపిపాస పురోగామియై బలీయ మైన మానవ స్వభావమై కూర్చొన్నది. అలాంటి రసపిపాసను వెనకకు నెట్టి జిజ్ఞాసను ముందు నిలబెట్టట మంటే బండిని గుర్రంముందుకు చేర్చట మన్నమాటే. ఇక రసపిపాసను గొంతు నులిమి వేయాలనటం గుర్రాన్ని కూల్చి వేయాలనటమే. కనుక శాస్త్రతత్వం లేని కళా తత్వాన్ని ఊహించటం సాధ్యమవుతుంది కాని, కళాతత్వాన్ని కలుపు కోని శాస్త్రతత్వాన్ని ఊహించటం అసాధ్యం. అందువల్లనే మానవుని మట్టంలో శాస్త్రం లేని కళా, కళలేని శాస్త్రమూ మృగ్యమైనా - కళలో శాస్త్రం కన్నా శాస్త్రంలో కళ కొట్ట వచ్చినట్లు కనిపిస్తుంది. కార్యాలోచనే శాస్త్రానిది. ఆచరణ అంతా కళే. సమర్థత, నిపుణత కళా లక్షణాలే. ఇవి ఆలోచన యొక్క అంగాలు కావు; ఆచరణ యొక్క అంగాలే. కాబట్టి తెలిసీ తెలియని రోజుల్లో ఏదో ఒక నిర్ణయానికి వచ్చి ఆ నిర్ణయాన్నే బారుకూ పట్టుక పాకులాడటం హేతువాదం కాదు – సరికదా, హేతువాదులు నిర్వచించే మతవాదానికిది మచ్చు తునక.

జీవ పరిణామ క్రమంలో చేతనవికాసంతో మానవ ఆవిర్భావం ఆరంభమయింది. కనుక చేతన వయస్సు లక్షల యేళ్ళలోనే వుంటుంది. కాని అధశ్చేతన వయస్సు ఎన్నోకోట్ల సంవత్సరాలుగా వుంటుంది. అధశ్చేతన జీవలక్షణమై, జీవపరిణామ దిశను నియంత్రించి, ఆఖరుకు చేతన యొక్క ఆవిర్భావానికి కూడ ఆధారభూతమై తన ఉద్వేగ లక్షణం ద్వారా ప్రకృతి అంతర్యంతో మంతనాలాడే విశిష్ట శక్తి కాగా, దాన్ని కొట్టివేయాలనటం ఎంతటి అర్థరహిత వాదమో, ఎంతటి అపాయకర వాదమో అవగత మవుతూనే వుంది.

మానవుని వివేకానికి పీఠమైన చేతన అతడు సృజించుకొన్న సరుకు కాదు. ఈ చేతనా, అంతకు పూర్వ మనాదిగా వుంటూ వచ్చిన అధశ్చేతనా సహకార భావంతో సహజీవనం చేస్తున్నవే కాని రెండూ కలబడి మెదడులో దెబ్బలాడు కోవటం లేదు. ఏనాడో ఆవిర్భవించిన అధశ్చేతన కానీ నిరుడు అంకురించిన చేతన కానీ ప్రకృతి కర్మాగారంలో ప్రకృతి పరిణామ (వికాస) దిశలో భాగస్వాములుగా అవతరించినవే. అందువల్ల యీ రెండూ ప్రకృతి శక్తులే. ఈ రెండూ ప్రకృతి ప్రయోజనాన్ని పట్టిచ్చే శక్తులే.

ప్రకృతికి ప్రయోజనం వున్న దంటే భౌతికవాదం గొంతు కోసుకొంటుందని నాకు తెలుసు. కాని ప్రకృతిలో లేని దేదీ జీవిలో లేదు. లేదు అంటే వుండటానికే వీలు లేదు. అంతకు ముందు గుప్తం (latent)గా వున్నదే వ్యక్త (patent) మవుతూ వస్తుంటుంది తప్ప లేని దేదీ కొత్తగా అవతరించదు. అంటే మనిషి తన ప్రత్యేకత అనుకొని విర్రవీగే వివేకం ప్రకృతిలో లేకుండా మనిషిలో పుట్టలేదు. ప్రకృతిలో నియమబద్ధత లేకుండా మనిషిలో హేతుబద్ధత రాలేదని సిద్ధాంతీకరించిన నవ్యమానవ వాదం మనిషిలోనీ జీవులలోనీ ఉద్వేగ ప్రవృత్తికి సమాంతర శక్తిని ప్రకృతిలో దర్శింప పూనక పోవటం శోచనీయమే కాదు, అతార్కికం కూడా. ఎందుకంటే ప్రకృతిలో ఉద్వేగ ప్రవృత్తీ, దాని బాహ్య లక్షణమైన సౌందర్య దృష్టీ లేకపోతే - ప్రకృతి కర్మాగారంలో తయారయ్యే ఖగోళాలు నియతరూపాలలో నియత మార్గాలలో ఏర్పడేవే కావు; స్థూలమైన విశ్వరూపం సూక్ష్మమైన పరమాణు రూపంలో ప్రతిబింబించేదే కాదు; అంటే పరమాణువు సూక్ష్మ విశ్వంగానూ, విశ్వం స్థూల పరమాణువు గానూ దర్శన మిచ్చేవే కావు; పరమాణు – విశ్వ సంబంధం లాంటిదే బీజ - వృక్షాల మధ్యా, అండ–పక్షుల మధ్యా, పిండ - జంతువుల మధ్యా కనిపించేదే కాదు.

జీవ ప్రపంచంలో వృక్ష రూపాలలో నేమీ, జంతురూపాలలో నేమీ, బాహ్యాకృతుల లోనేకాక నిర్మాణాలలో సైతం ఒక, క్రమం ఒక సౌష్ఠవం గోచరిస్తున్నాయంటే అవి ప్రకృతిలో నిక్షిప్తమైన సౌందర్యానికి ప్రతిచ్ఛాయలే అనాలి. చెట్ల శాఖావిన్యాసంలో సౌందర్యదృష్టి లేదా? ఒక జంతువును కానీ మనిషిని కానీ చూస్తే అందులో కుడి - ఎడమ భాగాలలో కనిపించే సౌష్ఠవం (symmetry) పరమార్థమేమిటి? సౌందర్యం ప్రకృతిలో నిండి నిబిడీకృతమై వున్నది. జంతువులూ మనుషులూ ప్రకృతి పరిణామ (వికాస) క్రమంలో తలెత్తిన ప్రకృతి భాగాలు. అందువల్లనే ప్రకృతి అంతర్లక్షణమైన సౌందర్యం (సుందరం) ప్రకృతి భాగాలైన జీవుల్లో ప్రతిబింబిస్తుంది. గూడును నిర్మించుకొనే గిజిగాడూ, బొమ్మను చెక్కే శిల్పి ప్రకటించే సౌందర్యం, ఉద్వేగం ప్రకృతిలో లేని వేమీ కావు. కాబట్టి కళ ప్రకృతి విలాసమే. జడ ప్రకృతిలో నిద్రాణంగా వుండి, జీవస్థాయిలో వికాసం పొందిన చేతనప్రకృతి ప్రదర్శించే సుందరమే కళ; శివమే నీతి; సత్యమే శాస్త్రం.

ప్రకృతి పరిణామ క్రమంలో అత్యున్నత దశ నలంకరిస్తున్నానని అహంకరించే మానవునికి సత్యమెన్నడూ బోధపడదు. ప్రకృతి ఏకాత్మ శీలమైనది. అది జడమూ చేతనమూ కూడా. జడ ప్రవృత్తి మూలంగా అది వున్న స్థితిని అంటి పట్టుకొని వుండాలని చూస్తుంది. చేతన ప్రవృత్తి మూలంగా పరిణామం చెందుతుంటుంది. జడత్వం స్థితి (being) శక్తి; చేతనత్వం గతి (becoming) శక్తి. ఈ రెండూ ఒకదాని కొకటి సహకారులు. జడత్వం లేకుండా అచ్చగా చేతనత్వమే ప్రకటితమైతే, ఆ క్షణాన విశ్వమంతా హిరోషిమా-నాగసాకిలై పోతాయి. అప్పుడు జడచేతనాల తారతమ్యాలను బేరీజు వేయటానికి ఎవరమూ మిగలం. కాబట్టే పరమాణు గర్భంలో ప్రకటితమయ్యే ప్రచండ గతిశక్తికి కళ్ళెము పట్టేదే స్థితి శక్తి. కనుక చేతనత్వం మనిషి నుద్ధరిస్తుంటే జడత్వం మనిషి నధః పతితుణ్ణి చేస్తుందనుకోవటం ఒక భ్రమ. కేవల జడత్వం, కేవల చేతనత్వం వాంఛనీయాలు కావు. కావలసింది యీ రెండింటి మధ్య సమస్థితి.

ఈ సమస్థితి ప్రకృతిలో ఎటూ కనిపిస్తున్నది. మనిషిలోనే తరచుగా అది తప్పుతున్నది. ఎందువల్ల? ప్రకృతి తనకు ప్రసాదించిన వరాలలో ఈ నాటిదైన వివేకమే తన దైనట్లూ, ఏ నాటిదో అయిన ఉద్వేగం తనది కానట్లూ గిరిగీసుకొని మానవుడహంకరించటమే. శాస్త్రం కేవలం వివేకజనిత మైనట్లూ, కళ కేవలం ఉద్వేగజనితమై నట్లూ, మానవుని మట్టంలో శాస్త్రం మీద ఉద్వేగానికీ కళమీద వివేకానికీ ప్రభావం లేనట్లూ భావించటం మానవుణ్ణి గూర్చిన అవగాహన బొత్తిగా లోపించటం వల్లనే. ముఖ్యంగా మనోవిజ్ఞాన శాస్త్రాన్ని గూర్చిన ప్రాతిపదికలు కూడా తెలియక పోవటం వల్ల కూడ యీ దోషం దొర్లుతున్నది.

మనిషి బాహ్యారూపం లాగే కుడిమెదడూ ఎడమమెదడూ సౌష్ఠవంగా నిర్మాణమై వున్నాయి. కుడివైపు సగాన్ని లఘు మస్తిష్కం (Minor Brain) మనీ, ఎడమవైపు సగాన్ని గురు మస్తిష్కం (Major Brain) మనీ అన్నారు.

ప్రధానంగా శాస్త్రం, గణితం, గణనం, భాషా పటిమ, రచన, తర్కంలాంటి ప్రవృత్తులు ఎడమ మెదడు ప్రత్యేకతలు; కళాభిరుచి, గానం, నాట్యం, శిల్పం, చిత్రలేఖనం, కల్పనా పటిమ లాంటి ప్రవృత్తులు కుడిమెదడు ప్రత్యేకతలు. అంటే ప్రధానంగా కుడిమెదడు సంశ్లేషణాత్మకమూ ఎడమ మెదడు విశ్లేషణాత్మకమూ అన్నమాట. అంటే కళకూ శాస్త్రానికీ కావలసిన పునాదుల్ని ప్రకృతి మానవ మస్తిష్కం లోనే సమకూర్చి పెట్టిందన్నమాట. ఇప్పుడు శాస్త్రం వ్యర్థ మనేవారు ఎడమ మెదడును తీసివేయా లన్నట్లే అర్థం. అలాగే కళ నిరర్థక మనేవాళ్ళు కుడి మెదడును పెరికి పారేయా లన్నట్లే కదా! అయితే వరుసగా కళా-శాస్త్ర దృష్టులకు ప్రాతినిధ్యం వహించే కుడి-ఎడమ మెదడులు తమలో తాము గుద్దు లాడుకోవటం లేదు. అవి ప్రకృతి సహజమైన సామరస్యంతో సహజీవనం చేస్తూనే వున్నాయి. కనుక శాస్త్రదృష్టిపైననో కళాదృష్టి పైననో కత్తికట్టవపూనే వాళ్ళు ఇలాంటి సహజీవనాన్ని సహించలేని వాళ్ళే అనాలి.

(సమాప్తం)

**The final resting place of Hitler's remains has long been a subject of speculation, with persistent theories that they could still be in the hands of the KGB secret police or its successor.**

# తెలుగు సాహిత్యం -
# కొన్ని నిజాలు?

- డా॥ ముకురాల రామారెడ్డి

'మిసిమి' జనవరి, 1993 సంచికలో ''తెలుగు సాహిత్యం - కొన్ని నిజాలు'' అనే వ్యాసం అచ్చయింది, చదివితే సాహిత్య పాఠకులెందరో, నావలెనే కొంత ఆశ్చర్యపడతారు.

ఆ వ్యాసంలో ప్రాచీనాంధ్ర కవులపై విసుర్లున్నాయి, ఆ విసుర్లలో తళుకులున్నాయి, - కసుర్లున్నాయి, ఆ కసుర్లలో బెళుకులున్నాయి. మొత్తంపై వ్యాసరచయిత (శ్రీ బొమ్మకంటి శ్రీనివాసాచార్యులు) తమ దోషజ్ఞతను వెల్లడించుకున్నారు. విమర్శలో దోషజ్ఞత ఒక ముఖ్యమైన భాగం కదా! అయినా దోషంగా తోచేదాంట్లో గుణమెక్కడ దాగి ఉందో! గుణంగా తోస్తూ దోషంగా పరిణమించే ప్రమాద మెక్కడుందో తెలిసిచెప్పటం బహుకష్టం. ''దృష్టం కిమపి లోకేఽస్మిన్ ననిర్దోషం ననిర్గుణం''. పైగా ఒక కాలంలో దోషంగా చెప్పుకున్నది తర్వాతి కాలంలో గుణమవుతుంది. అట్లే ఒక కాలంలో గుణంగా గౌరవానికెక్కింది, మరో కాలంలో దోషమవుతుంది. ఈ సాధారణ చర్చను ఇక్కడే ఆపి అసలు సంగతికి వెళ్ళి చూస్తే తమ ఆలోచనలను తామే ఒకటికి నాలుగుసార్లు చారిత్రక దృష్టితో తైపారువేసి చూసుకోవలసిన రచయిత ఏదో ఆవేగంలో పడ్డారు, కాస్త తొందరపడ్డారు.

ఉదాహరణకు:- 'దేశభాషలందు తెలుగులెస్స' అన్నది రాయలవారి సుభాషితం కాదు. అంతకు ముందే దాదాపు నూరేళ్ళ క్రితం 'క్రీడాభిరామం'లో కనిపించే ఒక భాషితం అది. అదే మాటను రాయలు మరింత ప్రచారంలోకి తెచ్చారనవచ్చు. ఆ మాట రాయలే అన్నట్లు ఎందరో చెప్పారుగదా! అని వాదించనక్కరలేదు. శ్రీ బొమ్మకంటి వారు తొందరపడ్డట్లు మొదట్లోనే తెలుస్తున్నది.

ఇక వ్యాసంలో చెప్పిన ముఖ్యసంగతి : ప్రాచీనాంధ్ర కవులకు, ముఖ్యంగా అనువాద కవులకు సొంత గొంతుకలేనట్లు అంటే స్వోపజ్ఞలేనట్లు 'సంఘంలో చుట్టూ జరుగుతున్న సంఘటనలకు సజీవంగా ప్రతిస్పందిస్తూ స్వంత అనుభూతులను... ...(వగైరా రచించటం)... ఎన్నడూ మన తెలుగు కవులకు ధ్యేయాలు కావు' అన్నారు. ప్రభువుల తలలూపించే ఉత్ప్రేక్షలతో వగైరా వగైరా కల్పనలతో రచించి అగ్రహారాదులు ఆర్జించుకున్నట్లు చెప్పారు రచయిత. ఇలాంటి ఆరోపణలు వినగానే సై అంటే సై ఈ రచయిత చేసిన విమర్శలు సై అనే సాహిత్య పాఠకులు నేడుండవచ్చు, ఉన్నారు కూడా. నేటి సంఘంలోని పాఠకులు/విమర్శకులు ఆలోచనలూ అవసరాలు వేరు. వెయ్యేండ్ల కిందటి సంఘంలోని అభిరుచులు వేరు. కాలభేదం కారణంగా ప్రాచీనాంధ్ర కవుల రచనలు నేటి వారిలో కొందరికి చులకనగా కనిపిస్తున్నాయి. అనవసరమైనవిగా, స్వార్థపూరితమైనవిగా కనిపిస్తున్నాయి. అదే కవులు ఈ కాలంలో ఉంటే ఈ కాలం వారికి నచ్చే విధంగా ఈ నాటి సిద్ధాంత రాద్ధాంతాలు చాటు చేసుకొని ఈ నాటి త్యాగాలు, భోగాలు, కపటాలు, కల్లలూ ఎన్నో ఎన్నో రకాలుగా అల్లి

అలరించేవారే అని నమ్మవచ్చు. ఆనాటి కవులకు సొంతగొంతుక స్వోపజ్ఞ లేదనుకోవటం కొందరపాటే - ఆనాటి సాంఘిక పరిస్థితులనూ, దురన్యాయాలనూ ఉన్నవి ఉన్నట్లుగా చిత్రించి ప్రచారం చేసేటంత వ్యక్తి స్వాతంత్ర్యం లేని కవులు వాళ్ళు. దానికి నాటి ఆర్థిక రాజకీయ - సాంఘిక పరిస్థితులే ముఖ్యకారణాలు. ఆ సాంఘిక వాతావరణం సృష్టించింది కవులు కాదు, ఆనాటి మత మేధావులు, రాజులూ, వారి సామంతులూ వగైరా దానికి కారకులు. యుగాల కింది కవులకెందరికో స్వోపజ్ఞ ఉన్నట్లు తెలుగు భారతంలో కనిపించే 'అనుసృజన' చెబుతుంది. శరదృతు వర్ణన చెబుతుంది. వేములవాడ భీమకవి మైలమ భీమనపై రచించిన చాటువు (శోకకావ్యం) చెబుతుంది. అసలు సంగతి : స్వతంత్ర కావ్యాలో, సంఘపరిస్థితులు వర్ణించే కావ్యాలో కొన్ని ఆ యుగాలలో వెలసినా ఆదరణ లేక అవి నశించి ఉంటాయి. నాటి కవులు స్వతంత్రంగా గళం విప్పినా వినిమెచ్చగలిగే హేతుబుద్ధి గలవారు ఆ యుగాలలో లేరనాలి. మతం రాజ్యమేలుతున్నది. మతాచార్యులకు రాజులు దాసులు. ప్రభువుల అదుపాజ్ఞలలో ప్రజలు. అందరి అభిరుచులూ ఆ వైపే - గత కథల వైపో, మతకథలవైపో, వ్రత కథల వైపో! స్వతంత్ర గళం విప్పినా వినే చెవులు సంఘానికి లేనప్పుడు ఆర్థిక స్వాతంత్ర్యం వ్యక్తి స్వాతంత్ర్యం లేని కవులు మాత్రం చేయగలిగిందేమిటి? తమకు తోచిన ధర్మమేదో, అధర్మమేదో చెప్ప బూనుకున్నప్పుడు కొన్నిచోట్ల పురాణ పాత్రల నాశ్రయించి, కొంత తామూ కల్పించి చెప్పారు. ఆయా యుగాలలోకవులు చిత్రించి చెప్పిన ధర్మాధర్మాలకు నేటి యుగాలలో పరపతి లేని మాట వాస్తవమే. అయినా ఇదీ యుగధర్మాలు తల్లకిందులైనందు వల్ల ఏర్పడ్డ వైనమే. చారిత్రక దృక్పథం గల విమర్శకులు ఏమంటారో మరి!

ఇక 'కవుల ధ్యేయాలు'. సాధారణ దృష్టితో గమనిస్తే కవులు ఏనాటి వారైనా తాము లక్షించిన సామాజిక సిద్ధాంత లక్ష్యం ప్రతిబింబించే రచనలే చేస్తారు. కవిత్వం అక్షరకళ. తనను అంటిన విషయానికి దీర్ఘకాలికమైన మన్నికను ఇచ్చే గుణం ఆ కళకుంది. ఇది గ్రహించిన కవులు తమ వ్యక్తిగత అభిరుచులుగానీ, సామాజిక ప్రయోజనాలుగానీ, సిద్ధాంతాలే వైనాగానీ తమకు నచ్చినవి కవిత్వ మిళితం చేస్తారు. కథను మార్చినా, సన్నివేశాలు కొత్తగా సృష్టించినా, పాత్రలతో పలికించినా; వర్ణనలూ, వక్రోక్తులూ, ధ్వనులూ వగైరా ఏవి కూర్చినా తమ లక్ష్యానికి అనుగుణంగానే చిత్రీకరిస్తారు. వెనకటి అనువాదకవుల/సృజనాత్మక కవుల రచనల్లోని మౌలికమైన యుక్తి ఇదే. నేటి కవుల మౌలికతలోని యుక్తి గూడా ఇదే.

జమీన్ దార్లూ, రాజులూ పోషించిన కవులనూ వారి రచనల రీతులనూ నిరసించారు సదరు రచయిత. జమీన్‌దార్లూ, రాజులూ ప్రజాపీడకులని నేటి విమర్శకులలో ఒక పక్షం వారి అభిప్రాయం. ప్రభువులు ప్రజారక్షకులు అని పూర్వకవులలో కొందరి అభిప్రాయం. రెండు పక్షాల అభిప్రాయాలలోనూ సగం సగం వాస్తవమే ఉన్నట్లు ప్రస్తుతానికి గమనించవచ్చు. అల్లరి జాతి జమీన్‌దార్లు కొందరు ప్రజాపీడకులే అనిపించుకున్నా పూర్వం ధర్మప్రభువులు కూడా ఉన్నట్లు కాళిదాసు వంటివారి రచనలు చెబుతాయి. దురహంకారం వెళ్ళగక్కే ప్రభునామకులను వ్యంగ్యంగానైనా వాతలు దిద్దకుండా ఆనాటి కవులు విడువలేదు. 'అధికార రోగపూరిత బధిరాంధకశవ' ప్రాయుడైన ప్రభునామకుడు ఒకడు, అలాంటి వారికెందరికో ప్రతినిధిగా, సుమతీ శతకంలో కనిపిస్తాడు. 'వాలవీజనముల గ్రాలుచు ఈగకు అంటీని ఖరవర్తులాండనములు' అయిన ప్రభుదురాత్ములను బహుమొరటుగా చెడదిట్టాడు కవికర్ణ రసాయనకర్త. 'మనజేశ్వరాధములను' తృణీకరించిన పోతన సరేసరి. ఇంకా భంగ్యంతరంగా

దొంగదొరతనాలను బజారుకీడ్చిన ఉదాహరణలెన్నో! తమను పోషించిన వారినో, తమకు మిత్రులైన వారినో అంతో ఇంతో పొగడడం సర్వమానవ స్వభావం (బెజవాడ గోపాలరెడ్డిగారి పెండ్లి సందర్భంలో శ్రీశ్రీ పద్యాలు రాసినట్లు) అనుకోవచ్చు.

పూర్వ ప్రభువుల ప్రశస్తిని అక్కడక్కడ పొగడిన అనాటికవుల దృక్పథం ఇప్పుడు కొందరు అనుకుంటున్నంత సంకుచితమైందికాదు - జీవితంలో ఘర్షణ-దాడులకు గురి అయిన వ్యక్తులకే అంతో ఇంతో చరిత్ర ఏర్పడుతుంది. జీవిత ఘర్షణలో వారు ఓడితేమి? గెలిస్తేమి? వారి ప్రసక్తి రికార్డులకెక్కుతుంది. ప్రజలకోసమనండి, తమ కోసమే అనండి పూర్వ ప్రభువులు ఘర్షణలో పడ్డారు. వారి సాహసాలను గుర్తించిన కవులు వాటిని రచించి పెట్టారు. నేడు సగటు మనుషులు/పేదవాళ్ళు ఘర్షణకు దిగారు. వీరి సంచలనాలను నేటి రచయితలు రికార్డు చేస్తున్నారు. రచయితలకు అలవడ్డ సిద్ధాంత భేదాల మమతలను బట్టి వారివారి చిత్రణల రీతులూ, ధ్యేయాలు మారవచ్చు. వాటిలో రచయితల స్వార్థాలు కొన్ని కప్పుకుని ఉన్నా ఉండవచ్చు. సాహిత్యరచన రెండంచుల కత్తి వంటిది. నిపుణుడైన రచయిత దాన్ని ఎటు తిప్పినా తిప్పవచ్చు. యుగయుగాల సాహిత్య ధ్యేయాల విచిత్రాలను ఇలాఇలా కొంతలో కొంత గ్రహించటమే మనవంతు. అంతేకానీ కొన్ని దశాబ్దుల క్రితమే ఎవరో తొందరపడి కేకలు వేసి ''తెలుగు సాహిత్యమంతా తగలబెట్టండి, శ్రీశ్రీ 'మహాప్రస్థానం' ఒక్కటే చదువుకోండి'' అన్నట్లు అదుపులేకుండా పరుగెత్తితే చరిత్ర వారిని పక్కకు నెట్టేస్తుంది. ఎంతో గొప్పదనుకున్న కమ్యూనిజం కనీసం కాలక్షేపానికైనా మిగలకుండా పోతున్నది. చారిత్రక పరిణామశక్తి అంత బలీయమైంది.

''ప్రభువుల తలలూపించే ఉత్ప్రేక్షలతోనూ, అతిశయోక్తులతోనూ, అక్షరరమ్యత అనబడే శబ్దాల గారడీలోనూ'' తెలుగు కవిత్వం నిండిపోయి పాడయినట్లు వ్యాసరచయిత అభిప్రాయపడ్డారు. - అవన్నీ, మరికొన్నీ లేకుండా ఏ భాషలోనూ కవిత్వకళ ఏనాడూ రాణించలేదండీ మహాశయా! ఉపమలూ, ఉత్ప్రేక్షలూ, రూపకాలూ, అర్థాంతరాలూ లేని కవిత్వం తాలింపులు లేని శాకం వంటిదే అవుతుంది. అవి ఎక్కువైతే పాకం రుచించని మాట వాస్తవమే. అవి అసలేవద్దు అనేవారు కవిత్వం జోలికే పోకుంటే సరి, ఏ చిక్కూ లేదు.

''చుట్టూ జరుగుతున్న సంఘటనలకు సజీవంగా ప్రతిస్పందిస్తూ'' రచించిన కవిత్వం ఉత్తమమైందని రచయిత అభిప్రాయం. 'మధురా విజయం' ఆముక్తమాల్యదలోని కృత్యాది వర్ణనలు కొన్ని-సమకాలిక సంఘటనలు ప్రతిబింబించేవి-ఉదాహరించారు. ఈ దృక్పథం ఒప్పుకోదగిందే. 'క్రీడాభిరామం'లో సింహాద్రి నరసింహ శతకంలో కృత్యాదుల్లో రచయిత మెచ్చినటు వంటివనేకం లభిస్తాయి. ఒక కావ్యంలోని వర్ణనలు, భావాలు, ఆలోచనలు ఆ కాల పరిస్థితులకు అద్దం పట్టేనట్లుండాలని రచయిత ఆశించారు. అలాగే కావ్యాలన్నీ రచిస్తే అవన్నీ సమకాలీన సాంఘిక పరిస్థితుల చిట్టాలో, చారిత్రక కావ్యాలో అయితాయి. కళాత్మక మైన ప్రగతి (growth of art) ఆ ఒక్క ప్రక్రియతోనే సాధ్య పడుతుందా? అనే ప్రశ్న మిగులుతుంది. పై రకంగా భావించినందుకేనేమొ! పోతన, వేమన వంటి కవులకు 'ప్రథమ శ్రేణి గుర్తింపు' రాలేదన్నారు. నా అభిప్రాయంలో అనువాదకవిత మేరకు నాచన సోమన, పోతన వంటివారు ప్రథమ శ్రేణి కవులే. వేమన స్థాయి నాటికీ నేటికీ విశ్వదాభిరామమైందే. అలాంటికవి తెలుగులో అంతకు పూర్వం రాలేదు. ఆ తర్వాతా రాలేదనే చెబుతారు. ఇక్కడ దృక్పథ భేదం ఉండవచ్చు.

''తెలుగులో కవులే విమర్శకులైనందువల్ల''? - ఉత్తమ కవిత్వంలో సాహిత్య విమర్శ, సాంఘిక విమర్శ అంతో ఇంతో దొర్లకమానదు. ఈ సంగతి ఆయాభాషల్లోని ఉత్తమస్థాయిగల రచనలు చదివి సరిచూడవచ్చు.

''తెలుగు అలంకార శాస్త్రం'' ప్రత్యేకంగా రూపొందలేక పోయిందన్నారు. ఇందులో మంచి సూచనే ఉంది కాని ఆ పని సాధ్యమా? ప్రాంతీయ భాషా - సాహిత్య సంస్కృతులను అల్లుకునిపోయిన సమైక్య ప్రయత్నం చేశారు సంస్కృతాలంకారికులు. తెలుగు మేరకు రూపొందే సాహిత్యరీతులు ఇవి అని గిరిగీసి చెప్పటమంటే! కాఫీ కప్పు నుంచి చక్కెరను విడదీసి చూపేటంత పని. ఎవరు చేయగలరు? అసలుకు అలా చేయవలసిన అవసరముందా?

తిక్కన ప్రయోగించిన అచ్చుతెనుగు పదాలు వేంకట - రామకృష్ణ కవులకు 'తలతిక్క' పట్టించాయి; తెలుగు నైషధం, ఆముక్తమాల్యద, కళాపూర్ణోదయం, వసుచరిత్ర వంటి ప్రౌఢ కావ్యప్రబంధాల ఆయా ప్రత్యేక ఫణితులు రామకృష్ణ కవికి నచ్చలేదు అన్నసంగతులు ఉటంకించారు. వారి అభిప్రాయాలకు తగిన సమాధానాలు చెప్పబూనుకుంటే కావ్యానువాదంలో ఎదురయ్యే ఉభయ భాషల సమస్యలూ; సృజనాత్మకతను రూపొందించటంలోని ప్రతిభావిశేషాలు; శబ్దకల్పన, అర్థకల్పనలోని సొగసులూ తిరగతోడాలి. ఆ పని ఇంతవరకే వేదం వెంకట రాయశాస్త్రి, సి.ఆర్. రెడ్డి వంటి ప్రముఖులు చేసి చూపారు.

''ప్రాచీన సంప్రదాయాన్ని పాటిస్తూ అన్యభాషానుకరణలకూ చౌర్యాలకూ తలపడినవారే ఎక్కువ''. ఇందులో కొంత నిజముంది. జరుగుబాటు కోసమో, చౌకబారు పేరు ప్రతిష్ఠలకోసమో ప్రాచీనాంధ్ర కవులు కొందరు అలా చేశారు. ఇప్పటి కవులూ ఎందరో అలాగే చేస్తున్నారు. దీనివల్ల సాహిత్య కళకు అదనంగా చేకూరేదేమీ ఉండదు. ఒక పక్షంగా కొంచెం లాభముంది : భాషలో కొత్త పలుకుబడి, కొత్త పదబంధాలు, కొత్త వాక్య నిర్మాణాలు ఏమైనా అభిస్తాయేమో కావలసిన వాళ్ళు చూసుకుంటారు.

ఒక సామెత ఉంది; ఏ యుగంలోనైనా ఎక్కువమంది కవినామకులు కవిత్వాన్ని తినేసి బతుకుతారట, కవిని తినేసిన కవిత్వం బతుకుతుందట!!

తెలుగు కవిత్వంలో సృజనాత్మకమైన మార్గం వేసిన కవి నన్నెచోడుడు. వస్తుకళను, రచనాకళను, భావకళను తీర్చిదిద్దటంలో త్రిముఖ సృజనాత్మకతను ప్రదర్శించాడు పాల్కురికి సోమన. ఈ వ్యాసంలో వీరి ప్రసక్తి రాలేదు. మరిచినట్లుంది.

మొత్తంపై తెలుగు కావ్య సాహిత్యాన్ని మరోసారి తిరగేసి చూడండి అన్నట్లు చెబుతూ వచ్చిన ఈ వ్యాసరచయితను ప్రశంసించవలసిందే. ★

Mrs Gandhi once said publicly, "Gujral has been talking about things including the separation of TV from radio but has done nothing about it." Which about sums up Gujral, who was always buzzing with bright ideas and setting up endless committees with his hand-picked Coffee House cronies. But if one tries to look back on his achievements, one can hardly find them even with a microscope.

# బహుముఖ రామాయణం

**Many Ramayanas:** The Diversity of A Narrative Tradition in South Asia, Edited by Paula Richman, University of California Press. S 14.95.

సమీక్షకుడు:
రవీంద్రనాథ్

అన్ని రచనలూ రాజకీయమైనవే అని వర్తమానకాలంలో ఓ వాదం వినిపిస్తూ వుంది. చర్చనీయాంశమైన వర్ణనం, కథ, చిన్నవచనం, జనాన్ని ఉద్దేశించి ఉద్బోధించి ఆకర్షించగలిగేది ఏదైనా - బాహాటంగా కాని అంతర్గర్భితంగాకాని మనుష్యుల ఆలోచనలను ప్రభావితంచేసి వారి మనస్సులను రూపుదిద్ద గలిగి వుంటుంది. సృజనాత్మకమైన సాహిత్యం అంతా జ్ఞాన ప్రణాళిక (నాలెడ్జి ప్రాజెక్టు) క్రిందకు వస్తుంది. సృజనాత్మక సాహిత్యం అంటే ఒకపద్యం (కవిత), చిన్న వచనం, మనలను ఆలోచింపచేసే పరిశోధనాత్మక విషయం ఏదైనాకానీ చర్చనీయం, ప్రపంచాన్ని సంశోధన చేసేదీ లేదా మనం వున్న ప్రపంచ ఆవరణాన్ని మనసులో పెంచి గాఢమైన అవగాహన కలిగించేదీ అని తాత్పర్యం. అలాగాకుండా దీనికి పర్యాయంగా మనలను ఆలోచింపనివ్వక, పరిశోధించనివ్వక, చర్చలు చేయనివ్వక నేరుగా కార్యోన్ముఖులం కావాలనీ, నాయకులుకానీ మతాధిపతులుకానీ సంప్రదాయ విధేయులైన పెద్దలుకానీ, సంఘ సంస్కర్తలుకానీ చెప్పినట్లు చేయాలనీ, నిర్దేశించే వ్రాతలు, రచనలను శక్తి లేక అధికార ప్రణాళికకు చెందినవి అంటారు (ప్రాజెక్టు ఆఫ్ పవర్).

మొత్తం మానవ రచనా సంప్రదాయ చరిత్రను పరిశీలిస్తే ఒక విషయం స్పష్టమవుతుంది. రచయితలు, కవులు, మేధావులు అంతా ఒక యుద్ధరంగంలో ఆది నుంచీ పాల్గొంటున్నారు. వారు ఏమి కోరుకొంటారంటే మానవ ఆలోచనా స్రవంతి ప్రాబల్యం లేదా నాయకత్వం విస్తరించాలని. అయితే రాజకీయ సిద్ధాంతవాదులు వీరిమీద అరిచికేకలేసి నోరుమూయించి లొంగదీసుకోవాలని ప్రయత్నిస్తూ వుంటారు. రచయితలు కవులు శక్తి ప్రణాళిక (ప్రాజెక్టు ఆఫ్ పవర్)కి అంకితమైన రాతలు రాస్తూ రాజకీయ సిద్ధాంత ప్రాబల్యానికి అణిగిమణిగి వుండాలని వీరు కోరుకొంటారు. (ఉదా: భావ కవులకు అరసం, విరసం వారికి వున్న తగాదా - సామాజికస్పృహ అనే గోల అంతా ప్రాజెక్టు ఆఫ్ పవర్ క్రింద వస్తుంది).

ఈ సంఘర్షణ యొక్క నాటకీయమైన శక్తి అంతా 'హేమ్‌లెట్' నాటకంలో మనం చూస్తాం. ఒక సమస్య గురించి స్వతంత్రంగా ఆలోచించటానికి ఒక ఆజ్ఞనుగాని సూచననుగాని అనుసరించి ప్రవర్తించడానికీ మధ్య ఏర్పడే ఘర్షణను 'హేమ్‌లెట్' నాటకంలో కవితాత్మకంగా మనం గమనిస్తాం. ఈ ఘర్షణకు సరియైన ప్రతీకగా రూపొందింది ఈనాటి అయోధ్య సమస్య. ఇంటింటా కొలిచే భగవంతుడైన శ్రీరాముని చుట్టూ ఆడుతున్నారీ నాటకం. రాముడు యిందులో పావు మాత్రమే. పురాతత్త్వ శాస్త్ర పరిశోధనలతో చరిత్రకారుల హడావిడితో రంగం అంతా నిండిపోయింది. హిందువులైన రామభక్తులతో కలిసి

రామాయణాన్ని ఉపయోగించుకొని లబ్ధి పొందాలనేవారితో యీ చరిత్రకారులు, పరిశోధకులు గుంపుగాకలిసి రంగం అంతా ఆక్రమించుకుని స్టేజి మధ్యకు వచ్చారు.

చర్చనీయాంశములైన వర్ణనాత్మక రచనలు అన్నీ ముఖ్యంగా సాంఘిక జీవితానికి సంబంధించినవి అయిన మతపరమైన గ్రంధాలు, పురాణాలు, ఇతిహాసాలవంటివి రాజకీయమైన శక్తికూడా కలిగి వుంటాయని రుజువైంది. ఈ రామాయణం, రాముని గురించిన రథన ఈనాడు సాహిత్య కారులకు శబ్ద శాస్త్రజ్ఞులకు మాత్రమే పరిమితమైన విషయంకాదు. సంస్కృత పండితులకు చరిత్రకారులకు మాత్రమే చెందిన సంగతి కాదు. జ్ఞాన ప్రణాళికను శక్తి ప్రణాళిక నుంచి వేరుగా వుంచాలని ఇండియాలోని సెక్యులరిష్టు శక్తులు భావిస్తూవుండగా దానిని చూర్ణం చూర్ణం చేశారు హిందూ రామభక్తులు. వారు ఎటువంటివారు? ఉత్తర భారతదేశంలోని పురుషాధిక్య సమాజం, హిందూ మతతత్త్వవాదులు మిళితమై ఈదేశపు ప్రతిపౌరుని పై సమరం ప్రకటించి దాడిచేసి మొత్తుతున్నారు. యస్. గోపాల్ సంపాదకత్వం వహించి రామజన్మభూమిపై ప్రచురించిన సంకలనం 'అనాటమీ ఆఫ్ ఎ కాన్‌ఫ్రాంటేషన్' అనే పుస్తకంలో, రాజకీయ ఉన్మత్తతకీ హేతుబద్ధమైన విచారణకీ మధ్య జరిగే ఘర్షణగా అయోధ్య వివాదాన్ని నిరూపించారు. ఆ పుస్తకంలోని రచయితలలో రొమిలాథాపర్ అయోధ్య సమస్యను వివిధ కోణాలనుంచి మనకు పరిచయం చేస్తూ హిందూమతం సహనశీలమైనదిగా ప్రసిద్ధి పొందినదనీ,. అటువంటి బహుముఖ సంస్కృతికి అపార్థాలు కల్పించి ధ్వంసం చేయడం జరిగిందనీ వాపోయారు.

అలా చేసినవారు మనల్ని కోతుల్ని చేశారనవచ్చు. కోపంతో మహోధృతంగా విజృంభిస్తున్న హిందూమతానికి ఎదురుగా గాయపడిన ఇస్లామిక్ మతస్థుల పక్షాన కేంద్రీకృతమైన చరిత్రకారులు చెప్పిన (ఆర్గ్యుమెంట్లు) వాదనలు వారికోసం ఉద్దేశించినవి కానే కావు. ముస్లిములను దృష్టిలో పెట్టుకొని చరిత్రకారులు వాదించుతారు. లౌకిక సెక్యులర్ ప్రజాస్వామ్య వాదులుగా ప్రమాదంలో వున్న ముస్లింజాతి సమస్యల పక్షం వహించవలసి వున్నప్పటికీ వారాపని చేయలేదు. రాముని గురించిన రథన యీ ఉద్యమానికి కేంద్రమై కూర్చున్నది. అది హిందూమతం వర్సెస్ ఇస్లాం కంటె ముందుకుపోయింది. హిందూమతం వర్సెస్ సిక్కిజంను కూడా దాటి ప్రస్తుతానికి రాముని గొడవ వేరే పరిధిలోకి జారుకుంది. చాలా క్లిష్టమైన, ముఖ్యమైన అంశం ఏమంటే, యీ చారిత్రకమైన ఉద్యమాలు ప్రదర్శించే మహోన్మాదస్థితి అది కాషాయమైనా, ఆకుపచ్చదైనా - సాంస్కృతికంగా మతపరంగా నాయకత్వాన్ని ప్రోత్సహించి, వారి ఎత్తుగడలద్వారా పశువులను తోలినట్లు గుడ్డిగా ఆ మార్గంలో మనలను ప్రవేశపెట్టి విధేయులనుచేసి లొంగదీసుకుంటాయి. దాన్ని విధేయులరంగు (గ్రే) అనవచ్చు. జ్ఞాన సంబంధమైన ఉద్యమాలన్నీ రాజకీయమైన ఫాసిస్టు ఎత్తుగడలకు అటువంటి ఉద్యమాలకు లొంగిపోకూడదని మనం కోరుకుందాం. విశ్లేషణ అనే దానిని రాజకీయాలు తుడిచి పెట్టేస్తున్న యీ సమయంలో రాముడిమీద, రామాయణంమీద ఒక కొత్త పుస్తకం వచ్చింది. ఆ కొత్త పుస్తకానికి ఆహ్వానం!

ఎ.కె. రామానుజం అనే చరిత్ర రచయిత యింతవరకు ఏ భారతీయ ప్రభుత్వంచేత గౌరవింపబడలేదు. ఆయన పాండిత్యం నిరుపమానం. రామునిమీద, రామాయణంమీద చదువదగిన కొత్త వ్యాస సంకలనం ఆయన ప్రచురించారు. పురుషాధిక్య హిందీ మాట్లాడే

ప్రాంతపు హిందువుల అనగా గోవధ నిషేధించమని పోరాడే మత ఛాందసుల గురించిన సత్యం ఆయన బయటపెట్టాడు.

వాల్మీకి రామాయణం, తులసీదాసు రామాయణం యివి రెండూ ఉత్తరభారతం వారి రామాయణాలు. అవి వారి పద్ధతిని వెల్లడిస్తాయి. ఇవి రెండూ మాత్రమేగాక రామాయణానికి అనేక వందల పాఠ భేదాలున్నాయి. ఉత్తర భారతదేశంలో ప్రాబల్యంగల పండితులంతా భూస్వామ్య నాగరికతకు చెందిన బ్రాహ్మణులు గౌరవించే సంస్కృత రామాయణానికి, దాని గొప్ప కథనపద్ధతికి ముగ్ధులై వాల్మీకి రామాయణం ఆధికారకమైనది అని నిర్ణయించారు. రామాయణాల్లో వాల్మీకి రామాయణం ఉత్తమోత్తమమైనది, గొప్ప రచన అని ఎల్లరి అభిప్రాయము.

రాముని సంచారం అతని కష్టాలు అందులో బాగా వర్ణితమైనాయి. ఏ ఒక్క రామాయణం సాధికారికమైనదిగా నిలబడజాలదని రామానుజం అంటారు. మన మనస్సులు బానిసలవలె వాల్మీకి రామాయణం ఒక్కటే ఆదర్శమైనది, సరైనది అనే భావనకు కట్టుబడి వున్నదానిని రామానుజం సడలేటట్లు చేశారు. తమిళనాడులో కంబన్, తూర్పున జైనులు, బౌద్ధులు, మధ్య భారతంలో అస్పృశ్యులైన తెగలు, తెలుగులో (అధ్యాత్మ రామాయణం) స్త్రీలపాటలు చెప్పినవారు - వీరంతా రామ కథను తమదైన పద్ధతిలో చెప్పినవారే. రామకథను అనేకమంది అనేక రకాలుగా చెప్పారు. కొన్ని ప్రత్యేక కాలాలలో భావ సౌందర్యంలో వాల్మీకి రామాయణ రచన యొక్క గొప్పతనం అన్నిటికంటె మిన్న అనిపించినా, ఇతర రామాయణ కథలు వాల్మీకితో సమానమైన ప్రతిపత్తిని, విలువను పొందుతాయి అనేది నిర్వివాదాంశం. రామానుజం ఏమి చెబుతున్నాడంటే - అనేక పాత్రలు, సంగతులు, కథనాలు అనుశ్రుతంగా రామాయణంలో వున్నప్పటికీ రామునిమీద సమష్టి సారస్వతంగా అంతా చూడాల్సి వుంది. ఈ సమష్టి నిధినుంచి అనేక ప్రాంతీయ సంస్కృతులు - ఇండియాలోవి, బయటివి అనగా థాయిలాండ్ , ఇండోనేషియా - వాటి వాటి అవసరాల కనుగుణంగా రామాయణాలను నిర్మించుకొని వారి ఆశయాలు ఆదర్శాలకు రామ కథను, కథనాన్ని మలుచుకున్నాయి.

ఈ సంకలనాన్ని కూర్చిన తలిమ్మా పదిమంది రచయితలు యీ ఉద్దేశాని కనుగుణంగా రాశారు. ఈ ఆదర్శాన్ని సమర్థిస్తూ వారివారి పద్ధతిలో వివరించారు. ఇవి రాజకీయంగా - సాంస్కృతికంగా చెప్పుకోదగినంత ప్రభావాన్ని కలిగివున్నాయి. ఉదాహరణకి వ్యాసకర్తలలో ఒకరైన వెల్చేరు నారాయణరావు స్త్రీలు తమ పాటలద్వారా మౌఖికంగా రామాయణాన్ని ఎలా చెప్పారో వివరించారు. సమకాలీన ఆంధ్ర దేశంలో రామకథ అంతా సీతమ్మ కథగా ప్రాచుర్యం పొందింది. రాముడి ప్రాధాన్యాన్ని తప్పించి అంతా సీతమ్మకు అంటగట్టారు ఆంధ్ర వనితలు. సీతకు సంబంధించినంత వరకు రాముడు మంచివాడేనా? లేక మంచివాడుగా నటించినవాడా అనే ప్రశ్న ఉత్పన్నమయింది. శూర్పణక విషయంలో రాముని ప్రవర్తన యింకా అమానుషంగా వున్నది. సీతవైపు నుంచి కథనం నడుస్తున్నది. రామాయణం ఆమెపరంగా చెప్పుకోవాలి. రాముడు ఆమెకు సఖుడే. రామాయణంలోని స్త్రీ పాత్రలపరంగా కథనం నడుస్తుంది. యుద్ధానికి ఏమీ వర్ణించదు కథనం. నైతికమైన, వ్యక్తిగతమైన విషయాలు అందులో వస్తాయి. బంధుప్రేమ, చుట్టరికాలు, పెళ్ళి గురించిన ప్రస్తావనలు వున్నాయి. రాముడు విల్లు విరవడంతో కథంతా మళుపు తిరుగుతుంది. రామాయణం దృక్పథంలోనే మార్పు వచ్చింది. ఆంధ్ర బ్రాహ్మణ వనితల కథనం ప్రకారం

సీతారాముల ప్రణయం ప్రధానమైన విషయం. అందులో సీత ముఖ్యురాలు. రాముని ప్రాధాన్యం తగ్గించడం మార్చడంవలన యీ జానపదులు రామాయణానికి మతపరమైన ప్రాముఖ్యాన్ని లేకుండా చేయలేదు. స్త్రీజనశక్తికి ఎక్కువ దోహదంచేసేలా యీ కథనాన్ని మలిచారు. ఎక్కువ విలువ ఎక్కువ ప్రాబల్యం సంతరించుకున్నది స్త్రీల రామాయణ రచన. ఉత్తర భారతంలోని రచనలలోని పురుషాధిక్య సమాజ పోకడకు అడ్డుకట్ట ఆంధ్రస్త్రీల రామాయణ రచన. ఇది ఒక మార్పు. రాజకీయ ప్రయోజనాలను ఆశించి పురుషుల ఆధిక్య మహారణ్యంలో రాముడ్ని, రామాయణాన్ని ఉత్తర భారతంవారు బంధించి తమ రాజకీయ ప్రయోజనాలను సాధించుకోవాలని చూస్తున్నారు. రామాయణ కథలోని మాధుర్యాన్ని, మంచిని అన్నిటినీ విసర్జించి ఆ గాధను ఇండియాలోని హిందూతత్త్వానికి పురుషాధిక్యతతో ముడిపెట్టి పబ్బం గడుపుకోవాలని చూస్తున్నారు. ఒక వీరుని భార్యగా సీతను తయారుచేశారు. దూరదర్శన్‌వారి నిర్వచనం కూడా ఇదే. స్త్రీలు ఓరిమితో కష్టాలను సహించే పాత్రలుగా మాత్రమే చూపించారు. పురుషుల ఆధిక్యత గొప్పతనం రాక్షసులతో పోరాడి జయించడం వరకే. టీ.వీ. వారి రామాయణం రాముని కథను దుష్టశిక్షణ యితివృత్తంగా స్వీకరించి పాక్షికంగా నేటి టార్జాన్‌గా రాముడ్ని మార్చింది.

దక్షిణ భారతదేశంలోని రామాయణాల ఔన్నత్యాన్ని, గొప్పతనాన్ని, వైవిధ్యాన్ని చూపడానికి యీ సంకలనంలోని వ్యాసాలు రసవత్తరంగా ప్రయత్నించాయి. రాముడ్ని గురించిన చిత్రణలో అతను ఏవిధంగానూ సీతకంటె అధికుడు కాదు. కాషాయరంగు కేతనానికి గొప్పదనం ఏమీ ఒలకబోయలేదు. సీత, శూర్పణక, రాముని వానరసేన అన్నిటికీ కథనంలో ప్రాముఖ్యం లభించింది.

శూర్పణక ముక్కూ చెవులూ కత్తిరించటంపై కేథలీన్ ఎర్న్డల్ రచించిన వ్యాసం భూతద్దంలో పరిశీలించినంత చతురంగా ఆకర్షణీయంగా వుంది. ఐదు కోణాలలో ఈ కథను చెప్పారు. భక్తి ప్రధానంగానూ మతపరంగానూ ప్రాముఖ్యం సంతరించుకుంది. కంబ రామాయణంలో రావణాసురుని చెల్లెలు శూర్పణక అందగత్తె అనీ ఆమె దురదృష్టానికి కవి చింతిస్తాడు కూడా. సి. రాజగోపాలాచారి కూడా కంబన్ పద్ధతిలోనే శూర్పణకను తను రచించిన రామాయణ వచనంలో వర్ణించాడు. ఈ సంకలనంలో పూర్తిగా సీత, శూర్పణక, ఊర్మిళ వీరిపాత్రలకు యింకా తదితర రామాయణంలోని స్త్రీ పాత్రలకు హెచ్చు ప్రాముఖ్యం యిచ్చి చర్చించడం జరిగింది. ఈ సంకలనానికి ఒక స్త్రీ, పండితురాలు సంపాదకత్వం వహించడం ఎంతో సముచితంగా వుంది. ఆమె తమిళ మత గ్రంథాలపై సాధికారికమైన పరిశీలన జేసిన వ్యక్తి.

ఈ సంకలనం సంపాదకురాలు పౌలా రిచ్‌మన్ మాటలలో - ''రామాయణం ఇండియాలో వున్న కథలలో చెప్పినది ఒకదానితో ఒకటి విభేదిస్తున్నది. వాల్మీకి రామాయణం, తులసీ రామాయణం ఎక్కువ ప్రాముఖ్యాన్ని సంతరించుకున్నాయి మిగతా వాటికన్నా. అయితే పోటీ లేకపోలేదు. పురుషాధిక్యం ముఖ్యంగా విస్తరించి వున్నప్పుడు మిగతా గొంతుకలు పోటీపడి వినిపించడానికి ప్రయత్నిస్తున్నాయి. స్త్రీల దృక్పథం నుంచి రామాయణంపై పాటలు వేరే కోణాలను, ఆశలను, ఆదర్శాలను చూపెడుతున్నాయి. స్త్రీల వైపునుంచి వారి ఆశలను ప్రతిబింబింప చేస్తున్నాయి.''

ముఖ్యంగా ఉత్తర భారతదేశపువారి పురుషాధిక్యతతో కూడిన మతపిచ్చి, వారి ఆధిపత్య

ధోరణిని పక్కనపెట్టి చూస్తే, మిగతా రామాయణాలను పరిశీలించడానికి యీ సంకలనం ఉపయోగపడుతుంది. ఉత్తర భారతం వారి సాంస్కృతిక అణచివేత చర్యలను బట్టబయలు చేస్తుంది. సంస్కృతిలో వుండే వైవిధ్యాన్ని తొక్కిపట్టి రామునిపేర ఒక టార్జాన్‌ను దింపడాన్ని గమనించి జాగ్రత్త పడాలి. స్థానిక ప్రతులలో వున్న రామాయణ కథనాలను వెలికితీసి ప్రజలలో ప్రచారం చేయాలి. తక్కువ తరగతుల ప్రజలు బానిసతనాన్ని ఎలా ఎదుర్కొంటారో భక్తినీ, ముక్తినీ ప్రసాదించే మోక్ష శక్తులను ఎలా లొంగదీసుకుంటారో గమనించ వీలవుతుంది. గాంధీని రాముడిలా ఇండియాలో కొలవడం యీ విషయాన్ని స్పష్టం చేయలేదా? రామభక్తుడిగా గాంధీజీ గొప్ప గౌరవం, ప్రేమ పొందలేదా? జాతీయోద్యమంలో గాంధీ రాముని సహాయంతో వెలిగాడు. సమానత్వాన్ని అన్నింట్లో కాంక్షించే యీనాటి సమాజంలో ముఖ్యంగా స్త్రీలు వారిగొంతుకలని రామాయణాన్ని గూర్చి వినిపించడం యీ సంకలనంలో ముఖ్యాంశం.

రొమిల్లా థాపర్, యస్. గోపాల్ వంటి పండితులు సూచించినట్లుగా హిందూమతతత్త్వం మతసహనాన్ని, బహుముఖ సంస్కృతిని, వ్యతిరేకతను స్వేచ్ఛగా వ్యక్తంచేసే అవకాశాన్ని అందరికీ యివ్వాలి. చరిత్రకారులు సాధికారికంగా చెప్పేది చేసేది అలావుంచితే ఆపనే యీ సంకలనం చక్కగా సమన్వయ దృష్టితో నెరవేర్చింది. ★

## Japan launches X-ray satellite

The Kagoshima Space Observation Centre in southern Japan said the Astro D, equipped with four X-ray telescopes and two X-ray cameras, successfully entered orbit about nine minutes after lift-off at 11 a.m.

We are strongly hoping the new satellite can help resolve the riddle of universe's evolution," a space centre spokesman said.

Its telescopes were more than 10 times more powerful than those aboard the Astro C, launched in 1987 to help scientists monitor stars some 10 billion light years away, the spokesman said.

The 420-Kg satellite, costing an estimated 10 billion yen (S84.7 million), is scheduled to begin space observation this summer.

Dr B. Gopala Reddy was the only minister after Sardar Patel who tried to bring colloquial Hindustani back into AIR. He set up a workshop which drafted news bulletins separately in Hindi and Urdu and then tried to narrow the gap by amalgamating them. But the Hindi lobby was gunning for him and got its chance just after our war with China. This was over the notorious Voice of America deal.

# సంగీతంలో సాంకేతిక పదాలు....

- కొండిపర్తి శేషగిరిరావు

మధురమైన భావాలను తియ్యగా ఆలాపించటంలోనుంచే సంగీతం పుట్టింది. అందుకనే 'సంగీతం' అంటే స్వర, రాగ, తాళముల కూడిక ఐన గానం.

సంగీత కళలోగల 'సప్తస్వరాలు' అన్నవి విచ్ఛిన్నమైన స్వరధ్వనులు. 'స్వరము' అంటే తనకు తానుగా శ్రోతను ఆనందపరచునది. ప్రతిస్వరానికి స్థాయి అన్నది ఉన్నది. 'స్థాయి' అంటే; వ్యాపించుట, సంకోచించుట, సమముగా ఉండుట అను లక్షణములు గలది. మంద్ర (తక్కువ) స్థాయిలోని స్వరాలు వ్యాపించు లక్షణం గలవి. తార (హెచ్చు) స్థాయి స్వరాలు సంకోచించు లక్షణం గలవి.

సంగీతం శ్రుతి అన్న భూమిక మీద ఎక్కువగా ఆధారపడి ఉన్నది. సప్త స్వరాలలో 'ఆధార షడ్జము' అంటే మొదటి స్వరము, లేదా మొదటి స్వరము యొక్క ధ్వని విశేషము, లేక స్వరావయవ ప్రారంభమున గల ఓ కమ్మని ధ్వని. అదే 'శ్రుతి' అవుతుంది. ఆ ప్రారంభ ధ్వనిలో శ్రావ్యత లేకపోతే అది 'అపశ్రుతి' ఔతుంది.

సంగీతకళకు పదార్థాలైన స్వరాలలో ప్రకృతి స్వరాలు, వికృతి స్వరాలూ అని రెండు రకాలు ఉన్నాయి. విభేదము లేని స్వరము 'ప్రకృతి స్వరము'. విభేదము గల స్వరము 'వికృతి స్వరము'. అంటే వికృతి స్వరము శుద్ధముగా ఒకటే ఐనా; ఆ స్వరానికి పైనా క్రిందా గల శ్రుతులతో ఆ స్వరం పలుకుతూ, మూల స్వర నాదానికి కొంచెం విభేదంగా ఉంటే శ్రావ్యంగా కూడా ఉంటుంది. అందుకని అది వికృతి స్వరం ఐందే తప్ప అది వికృత స్వరం కాలేదు. ప్రకృతి స్వరము ఎల్లప్పుడూ ఒకే విధాన పలుకుతుంది. ఆ ధ్వని స్థానం తప్పి కాస్త పైకీ క్రిందికీ జరిగితే అందులోని సుందర ప్రకృతి వికృత మౌతుంది. అందుకని ప్రకృతి స్వరాలు స్థిర స్వరాలు, వికృతి స్వరాలు చర స్వరాలు ఐనవి. రాగ విస్తరణకు ఈ వికృతి స్వరాలే ఎక్కువ అవకాశాన్ని కలిగించాయి.

వివిధమైన స్వర సమ్మేళము వలన అనంతమైన రాగాలు ఏర్పడుతున్నాయి. రాగములో స్వరాల ఆరోహణ అవరోహణలు ఉన్నాయి. 'ఆరోహణ' అంటే క్రింది నుంచి పైకి స్వరాలు పోవుట. పైనుంచి క్రిందకు స్వరాలు ప్రయాణించుట 'అవరోహణ'. ఈ ఆరోహణ అవరోహణలు కలిసి 'మూర్ఛన' అవుతుంది. ఇలాంటి స్వర సమూహ మూర్ఛనలతో ఏర్పడునవి 'గ్రామములు' అనబడుతాయి. గ్రామములోని స్వరాలను అందమైన మెలికలతో దాటులతో అల్లిన అది 'జాతి' అవుతుంది. అందము కొరకూ, రాగము రంజించుటకూ క్రమ స్వరముల మధ్య ఒక స్వరమును గానీ, రెండు స్వరములను గానీ లేక కొన్ని స్వరములను గానీ విడిచి పెట్టి సాగిపోవుట 'దాటు స్వరము' అన బడుతుంది.

గాన కళా జగత్తులో రాగములు అనంతమైనవిగా విస్తరించి ఉన్నవి. రాగములోని ఆరోహణ అవరోహణలలో సప్తస్వరాలు పూర్తిగా ఉన్నప్పుడు అవి 'సంపూర్ణ రాగములు' గాను; ఆరు స్వరములు మాత్రమే ఆరోహణ అవరోహణలలో ఉన్నప్పుడు అవి 'షాడవ రాగములు'

గానూ; అలాగే ఐదు స్వరములు ఆరోహణ అవరోహణములందు ఉన్నప్పుడు అవి 'ఔడవరాగములు' గాను వ్యవహరింప బడుతుంటాయి.

వికృతి స్వరములలోని శ్రుతి భేదముల వలన శుద్ధము, చతుశ్రుతి, షడ్ శ్రుతి భేదములు; సాధారణ అంతర భేదములు, మధ్యమ, ప్రతి మధ్యమ, కైశికీ కాకలీ విభేదములు అన్నవి ఏర్పడు తున్నాయి. ఆ విభేదముల వలన రాగములు జనక రాగములు గానూ, లేక మేళకర్తరాగములు గానూ, జన్యరాగములుగానూ, భాషాంగ రాగములుగానూ విస్తరించినవి. 'జనకరాగము' అంటే ఆరోహణ అవరోహణములలో ఒకే స్వరములు ఉండవలెను. ఇది మూలరాగము క్రింద లెఖ్ఖ. 'జన్యరాగము' అంటే జనక రాగములోని వికృతి స్వరములలోగల శ్రుతుల భేదముతో పుట్టినది. ఇక భాషాంగ రాగము అంటే రాగానికి నిర్దేశింప బడిన ఆరోహణ అవరోహణ స్వరములలో ఒకటిగానీ రెండు గానీ శ్రుతి భేదము గల అన్య స్వరము గలది. రాగము యొక్క ఆరోహణలోగానీ అవరోహణలోగానీ, క్రమముగా ఆరోహించటంగానీ అవరోహించటం గానీ లేక ఎగుడు దిగుడుగా స్వరములు ఉన్నప్పుడు అది 'వక్రరాగ' మగును.

రాగములో ఆరాగానికి నిర్దేశింపబడిన స్వరాలూ, ఆ స్వరాలగతిలో నిర్దేశితమైన ఆరోహణ అవరోహణములు గల మూర్ఛన ఉండును. దాని వల్ల ఆరాగ స్వరూపము వ్యక్తమగును.

ప్రతి రాగమునకు ఒకటో రెండో జీవ స్వరాలు ఉంటాయి. రాగచ్ఛాయా స్వరూపాన్ని స్పష్టపరిచేవి ఆ రాగములో గల 'జీవ స్వరాలు'. ఈ జీవ స్వరాలనే 'అంశ స్వరాలు' అని కూడా అంటారు. ఈ జీవస్వరమే రాగానికి ప్రాణము. కనుకనే రాగాలాపనలో అనేక పర్యాయాలు ఈ జీవ స్వరము పునరావృత్తమవుతూ ఉంటుంది. రాగములో జీవస్వరములా కాకుండా తక్కువ ప్రాధాన్యం గల స్వరములను 'పరిచారికా స్వరములు' అని అందురు.

రాగ కల్పనా గమనములో మొదటగా ఉండునది 'గ్రహ స్వరము' చివరగా ఉండునది 'న్యాస స్వరము' ఈ రెండూ రాగాలాపన అల్లికకు అనుకూలమైన ఎత్తుగడ ముగింపు స్వరాలు. ఈ మధ్యలో స్వరకల్పనకు తోడ్పడి స్వరాభివృద్ధికి తోడ్పడునవి 'స్వర పల్లవులు'. ఒక రకంగా చెప్పుకోవాలంటే 'గ్రహ స్వరము' 'ఎత్తుగడ స్వరము'; 'ముగింపు స్వరము' 'న్యాస స్వరము.' రాగకల్పన యొక్క అంద చందాలు కొంత వరకు ఈ రెంటి మీదే ఆధారపడి ఉంటాయి. ఏ రెండు స్వరాలను కలిపి వాయించిన ఆరెంటి కలయిక వలన వచ్చిన నాదము మధురముగా ఉండునో ఆ స్వరాలు 'మిత్ర స్వరాలు'.

ఇలాంటి స్వరాంశలన్నిటినీ కలుపు కొంటూ సాగిపోవునది 'స్వర సంచారము'. అలాంటి స్వర సంచారముతో మనోహరతను సృష్టిస్తూ సాగిపోవు రాగాంశము 'రాగసంచారము' అనబడును. ఈ సంచారాల స్వర కల్పనతో రాగాలాపన ఆవిష్కరింపబడి అందులో రాగవృద్ధి కలుగుతుంది. కనుక రాగాన్ని వృద్ధి పరచునది 'రాగాలాపన'.

సంగీత కళా జగత్తులో వర్ణాలు సాధన వల్ల అత్యుత్తమములై, రాగములో విశేష సంచార ముతో రంజక ప్రయోగము గలవి. గాన కళలో విభిన్నమైన నైపుణ్యములను సాధింప వీలైనవి 'వర్ణాలు'. ఇవి సంగీత కళలోని సాధకుని పై మెట్టుకు ఎక్కించునవి. కల్పనాచాతుర్యాన్ని సంగీత కళకు కూర్చి పెట్టునవి ఈ 'వర్ణాలు'.

రాగంలోని శోభకూ మాధుర్యానికీ జీవం, రాగంలోని స్వరాలకు ఇచ్చే వివిధములైన గమకాలు. అవి దశవిధములు. ఇంకా ఎక్కువ. కేవలం స్వరాన్ని పాడిగా పలకకుండా, లేక వాదనము చేయకుండా; పై స్వరాన్నుంచో, క్రింది స్వరాన్నుంచో ఆ స్వరానికి విచిత్ర ప్రక్రియలో సాగిపోవుట 'గమకము' అవుతుంది. ఈ గమక పదార్థము అభివృద్ధియై ఎన్నోరీతు లను సంతరించుకొని 'దశవిధ గమకాలు'గా, అంతకన్నా ఎక్కువగా వృద్ధియై సంగీత కళకు శోభను సౌందర్య తత్వాన్ని రసతత్వాన్నీ రసపుష్టినీ ఇస్తున్నవి. పాశ్చాత్య సంగీతంలోనూ 'ఫింగర్ టెక్‌నిక్స్' అన్న రీతిలో ఈ గమక సామ్యం ఉన్నది. ఈ గమకముతో బాటు 'వరిక' అన్నది కూడా స్వరానికి రాగానికి చక్కని సౌందర్య మాధుర్యాన్ని ఇస్తుంది. స్వరాన్ని కంపింపజేయుట, రాచుట అన్న విధానం 'వరిక'. ఈ గమక వరికలు సంగీత కళలో భావపుష్టికి రసావిష్కరణకూ ఎంతో బలంగా గానకళలోని రసతత్వానికి ఉపయోగించ బడుతున్నాయి. ఇవి వినా సంగీతమే లేదు అన్నంత బలంగా ఉన్నాయి ఇవి సంగీత కళలో.

స్వరరాగ సౌందర్యముతో ప్రవాహగతిలో సాగిపాయే సంగీతాన్ని క్రమగతిలో ప్రయాణింప జేసేది 'లయ'. కాల భూమిక మీద సాగిపోయే రాగాన్నీ, అందులోని లయనూ అందంగానడి పేది 'గతి'. ఆ గతి నింపాదిగా నడిస్తే అది 'సమగతి'గానూ; వేగంగా నడిస్తే 'ద్రుతగతి'గాను ఔతుంది.

అఖండమైన లయ వివిధ ఖండికలుగా కొన్ని క్రియలతో ఖండింప బడి ఆక్రియల సంపుటితో 'తాళము' అన్నది ఏర్పడుచున్నది. తాళము అంటే సంగీతమును కొలుచు కాలపు కొలబద్ద. అందమైన ఎన్నో నడకలు గల ఈ తాళము గానకళా గతికి ఎంతో వన్నె తెచ్చినది. లయలో నుంచి తాళము పుట్టి, తాళము నడుమను క్రమగతిలో నడుస్తూ తిరిగి ఈ లయ ఉంటుంది. ఈ తాళములో లయలో క్రియలూ ఉంటాయి. 'క్రియ' అంటే తాళము వేసేటప్పుడు చేతిని పైకెత్తి కొట్టుట. వ్రేళ్ళు లెక్కించుట, చేతిని విసురుట మొదలుగా గల తాళసంజ్ఞల పనులన్నీ క్రియలు అనబడును. ఈ క్రియలో ఒక అక్షరం (సెకండు) పలుకు కాలం ఉంటుంది. ఒక క్రియకు ఒక దెబ్బకు ఒక అక్షరంపలుకుతుంది. అది 'మొదటి కాలం'. ఒక దెబ్బకు రెండు అక్షరాలు పలికితే అది 'రెండవ కాలం'. నాలుగు అక్షరాలు పలికితే 'మూడవ కాలం'. ఇలా కాలాలు ఆరు వరకు ఉన్నాయి. ప్రతి కాలానికీ రెట్టింపు అక్షరాలు పలుకుతుంటాయి. క్రియ మాత్రం ఒక్కటే. అది మారదు. చివరి కాలమైన ఆరవ కాలానికి ఒక క్రియకు ముప్పై రెండు అక్షరాలు చొప్పున పలుకు తుంటాయి. అది 'షట్కాలము' అవుతుంది. మూడవ కాలం దాటిన తరువాత కాలాలను 'పై కాలాలు' అని అంటారు.

తాళములో షడంగములు అన్న అంగాలు ఉన్నాయి. ఈ అంగాలలో ముఖ్యమైన వాటిలో లఘువు ఒకటి. 'లఘువు' అంటే ఒక దెబ్బ కొట్టి వ్రేళ్ళు లెక్కించుట. ఈ లఘువు మూడు అక్షరాల (త్రిశ్రజాతి) నుంచి తొమ్మిది అక్షరాల (సంకీర్ణ జాతి) వరకు ఉండును. లఘువు ఉండే అక్షర కాల భేదాలను బట్టి లఘువు యొక్క 'జాతులు' ఏర్పడుతున్నవి. తాళాన్ని వాయించే వాద్యాలు 'తాడన వాద్యాలు' లేక 'లయ వాద్యాలు' అని అంటారు.

ఇన్ని అంశాలు ఉన్న గానకళ, ఈ అన్ని అంశాలనూ చాలా వరకు వర్ణము అన్న సాధనా పాఠంలో నింపుకొని ఉన్నది. అందుకునే ఈ వర్ణాలను ఎంతగా సాధన చేస్తే, గాన కళ అంతగా కంఠంలో చేతిలో ఉంటుంది. కనుకనే సంగీతంలో విశేష స్వర సంచారాలతో రంజక ప్రయోగము అన్న సంచారాలు గలవి 'వర్ణాలు' అవుతున్నవి.

ఇక -

రాగము నిర్దిష్ట స్వరాలను కలిగి ఉన్నప్పటికీ ఆరాగంలోని స్వరాలను వివిధ స్థాయిల లోనూ, ఆ రాగాల కూర్పులో ఎన్నో తియ్యదనాలను సృష్టింప జేసేది 'స్వర కల్పన' ఔతుంది. అందులోని స్వరాల మేళనమే 'స్వర మేళనము' ఔతుంది.

సంగీత కళా జగత్తులో సాహిత్యము ఓ అంశము. కనుక సంగీతములో సాహిత్యము 'మాతువు' అవుతుంది. ఆ సాహిత్యంపైన ఉన్న సంగీతాక్షరాలైన స్వరాలు 'ధాతువు' అవుతుంది. అందుకని సంగీత కళలో స్వరరచనను 'ధాతువు' అంటారు. సాహిత్యాన్ని 'మాతువు' అంటారు. సాహిత్య గీతానికి సంగీతాన్ని కూర్చుట సాహిత్యానికి 'స్వర రచన' చేయటం అవుతుంది. దానినే సాహిత్యానికి 'సంగీతపు మెట్టు కట్టడం'. 'బాణీ కట్టడం' అని కూడా అంటారు.

గాత్రగానం వాద్యవాదనం అన్న రెండు విధాలుగా సంగీత కళ ఉంది. గాత్ర సంగీతానికి వాద్యవాదనం సహకరిస్తూ గాత్రాన్ని అనుకరిస్తుంది. అది 'సోలో' సంగీతం. వాద్య సంగీతంలో గాత్రం ఉండదు. (కానీ ఆ లక్షణం ఉన్నది). ప్రధాన వాద్యం ఒక్కటే ఐతే దాన్ని మిగిలిన వాద్యాలు అనుసరిస్తుంటాయి.

వాద్యాలు ప్రధానంగా తీగెలు గల వాద్యాలు, గాలిని పూరిస్తూ వాయించే వాద్యాలు అని రెండు రకాలు. తీగెలు గల వాద్యాలను 'తంత్రీ వాద్యాలు'గా, గాలిని పూరిస్తూ వాయించే వాద్యాలను 'పూరక వాద్యాలుగా', చర్మ వాద్యాలను 'తాడన వాద్యాలు' 'చర్మ వాద్యాలు' 'లయ వాద్యాలు' 'తాళ వాద్యాలు'గా వ్యవహరిస్తుంటారు.

వాద్యాల మీద స్వరాలమెట్లు ఉన్న, ఆ వాద్యాలు 'మెట్లు ఉన్న వాద్యాలు'; మెట్లు లేకుండా కేవలం ఫింగర్ బోర్డు ఉండి దాని మీద తీగెలు ఉంటే అవి 'మెట్టు లేని వాద్యాలు' ఔతాయి.

గాత్ర సంగీతంలో గాత్రం సన్నగా ఉంటే దానిని 'సన్న విడిధ్వని' గల గాత్రంగానూ, అలాకాక బొంగురుగా ఉంటె అది గౌళ గాత్రముగాను చెలామణి ఔతుంటాయి. గాత్ర సంగీతానికి ప్రధాన మైన గొంతులో నాదాన్ని పుట్టించే అవయవం 'స్వర పేటిక'.

నాటకాలలో, సినిమాలలో, టి.విలో దృశ్య ప్రధాన మైన వాటికి వాయించబడు వాద్య సంగీతం 'నేపథ్య సంగీతం'. అలానే నేపథ్య సంగీతంలో కేవలం ఒక్క వాద్యమే ఉండదు. కొన్ని వాద్యాల బృందం ఉంటుంది. అది 'బృంద వాద్య సంగీతం' అవుతుంది. ఒకరికన్నా ఎక్కువ మంది ఒకేసారి కలిపి గానం చేస్తే అది 'బృందగానం' అవుతుంది.

సంగీత కళా జగత్తులో కచ్చేరీ ప్రధానం. కచ్చేరీలో సంగీత కళాకారుని శక్తీ అతని నైపుణ్యమూ, అతనిలోని రస సృజనా ప్రదర్శింపబడతాయి. అప్పుడు కళలో స్థాయి భావాన్ని చూపించేవే సంగతులు, నిరవల్స్, మనోధర్మ సంగీతము అన్నవి. 'సంగతులు' అన్నా

వాటిలో సాహిత్య భావం రకరకాలుగా ప్రవర్ధమాన మౌతూ భావసంపత్తితో హెచ్చు తగ్గుల కూర్పులతో పాడబడును. రాగ స్వరూపమును సాహిత్య భావమును పరిపూర్ణ స్వరూపముతో తాళ బద్ధముగా పాడుట 'నిరవల్స్'. గాయకుని ఊహాశక్తిని బట్టి అతని మనస్సునకు తోచినటుల అప్పటికప్పుడు స్వరకల్పన చేస్తూ రంజకముగా గానము చేయుట 'మనోధర్మ సంగీతము'. మనోధర్మ సంగీతములో సాధారణంగా సాహిత్యం ఉండదు. కనుక సాహిత్యస్పర్శ లేని ఈ సంగీతాన్ని 'శుద్ధ సంగీతము'గా చెప్పుకోవచ్చు. అలానే కేవలం వాద్య సంగీతాన్ని కూడా కొంతవరకు శుద్ధ సంగీతంగా చెప్పుకోవచ్చు. సంగీతము కొరకు వ్రాసే పాటలూ గేయాలూ మొదలైనవి 'సంగీత సాహిత్యము'. సంగీత కళలో చేసే స్వర కల్పనా సృష్టిని 'స్వర సాహిత్యము'గా చెప్పుకోవచ్చు.

పాశ్చాత్య సంగీత కళలో స్వరాలు ఉన్నాయి. వాటిని 'నోట్సు' అని అంటారు. ఆ స్వరరచనను 'నొటేషన్' అనిగానీ 'కంపోజింగ్ ఆఫ్ మ్యూజిక్' అని గానీ అంటారు. వారి సంగీతం 'హార్మనైజింగ్ సిస్టమ్ ఆఫ్ మ్యూజిక్'. ఆ సంగీతంలో గాత్రాన్ని అనుసరిస్తూ వాద్య సంగీతం నడవదు. వాద్యాలకు పంచబడిన స్వరాలను ఆయా సందర్భాలలో ఆయా వాద్యాలు ఆ స్వరాలను ఆ స్వరసమ్మేళనాలను మాత్రమే వాదనం చేస్తుంటాయి. ఆర్కెస్ట్రా (వాద్య బృందం)లోని వాద్యాలు ఒకే శ్రుతిలో ఉండవు. ఇందు వివిధ స్వరాలు ఏక కాలమున పలకబడుతుంటాయి. గాత్ర ప్రారంభం నుండి చివరవరకు ప్రతి వాద్యం పలకాలి అనే నియమం లేదు. సందర్భాన్ని బట్టి భావ రసాలననుసరించి వాద్యాల కూర్పు, ఆ వాద్యాలకు కూర్చిన స్వరాల కూర్పు ఉంటాయి.

కాన ఇది 'హార్మనైజింగ్ సిస్టమ్ ఆఫ్ మ్యూజిక్' అయింది. ఇది మధుర స్వన సంగీతం లేక మధుర స్వర సంగీతం. ఈ 'హార్మనైజింగ్ మ్యూజిక్'నే 'ఆర్కెస్ట్రేషియన్ మ్యూజిక్' అని కూడా అంటారు. పాశ్చాత్య సంగీతంలో, గమకముల వలె స్వరానికి అందమును కలిగించునవి గ్రేసెస్, అగ్రిమెన్స్, వైబ్రేట్స్ అన్నవి ఉన్నాయి.

సంగీత కళా జగత్తు ఇలా ఎన్నో సౌందర్య రుచిగల అంశాలను కలిగి ఉన్నది. సంగీత కళలోని సౌందర్యం అంతా ఈ సాంకేతిక సౌందర్య అంశాలలో దాక్కొని ఉన్నది. దానిని తడిమితే ఆ అంశాలు మన చేతికి తగలగలవు. అలా తగలటమే కాక అవి మన శరీరంలోకి మన మనస్సులోకి కూడా ప్రవహిస్తాయి. ★

> There are hopeful signs that "Vajpayeeism" is gaining ground in the BJP. After the early loating ("we did it") has passed, thoughtful people in the BJP are wrestling with the problem of regaining respectability as a mainstream party. They realise that once things cool down, elections will have to be fought and they will not be won based on a platform of hate. The average Indian voter is too decent for that.
>
> – *Gurucharan Das in T. India*

Printed, Published and Edited by ALAPATI RAVINDRANATH at Kala Jyothi Process Pvt. Ltd., 1-1-60/5, Iftekar Mansion Lane, R.T.C. X Roads, Musheerabad, Hyd-20. Ph. 612436, 612337.

**Editorial NEST**

Plot No. 337 A, Road No. 10, Jubilee Hills, Hyderabad-500 034. Ph. 247717

Statement showing ownership and other particulars about
MISIMI required by Rule 8 of the
Registration of Newspapers (Central) Rule 1956;

# Form IV


| | | | |
|---|---|---|---|
| 1. | Place of publication | : | Hyderabad |
| 2. | Periodicity of publication | : | Monthly. |
| 3. | Printer's Name | : | Alapati Ravindranath, |
| | Nationality | : | Indian |
| | Address | : | 1-1-60/5, Iftekar Mansion Lane, R.T.C. X Roads, Musheerabad, Hyderabad-500 020. |
| 4. | Publisher's Name | : | Alapati Ravindranath |
| | Nationality | : | Indian |
| | Address | : | 1-1-60/5, Iftekar Mansion Lane, R.T.C. X Roads, Musheerabad, Hyderabad-500 020. |
| 5. | Editor's Name | : | Alapati Ravindranath |
| | Nationality | : | Indian |
| | Address | : | 1-1-60/5, Iftekar Mansion Lane, R.T.C. X Roads, Musheerabad, Hyderabad-500 020. |
| 6. | Name and address of individuals owning the newspaper and partners or shareholders holding more than one percent of total. | : | Alapati Ravindranath 1-1-60/5, Iftekar Mansion Lane, R.T.C. X Roads, Musheerabad, Hyderabad-500 020. |

I, Alapati Ravindranath, Printer & Publisher, Misimi, hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

(Sd/-)
Alapati Ravindranath
Printer, Publisher & Owner.

MISIMI/ మిసిమి RNI Regd No.45042/90 Telugu Monthly Hyderabad-500 020

Postal Regd. No.H/SD/191



**MACHINE MADNESS:**

*In Modern Times, Charlie Chaplin assumed an awkward posture vis-à-vis technology.*